## షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని పంచాయతీలకు ప్రత్యేక సడలింపులివ్వాలి



### కేంద్రాన్ని కోరిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామ పంచాయతీల పనితీరును కేవలం పన్నుల వసూళ్లతోనే అంచనా వేయకుండా.. ప్రజలకు అందిస్తున్న సేవలు, పారిశుద్ధ్యం, పారదర్శకత తదితర అంశాలకు ప్రాధాన్యమివ్వాలని మంత్రి సీతక్క కేంద్రాన్ని కోరారు. సొంత ఆదాయ వనరులు పరిమితంగా ఉండే ఆదివాసీ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలపై అదనపు పన్నుల భారం మోపొద్దని.. పనితీరు ఆధారిత గ్రాంట్ల నుంచి వాటికి ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 16వ ఆర్థిక సంఘం, గ్రామీణ స్థానిక సంస్థల సిఫార్సులపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన సదస్సులో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. '16వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన పనితీరు ఆధారిత గ్రాంట్లు, ఓన్ సోర్స్ రెవెన్యూ వంటి నిబంధనల్లో ఆదివాసీ, గిరిజన, షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలి. స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయాలు తీసుకునేలా అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్లను కొనసాగించాలి. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా ఎన్నికలు జరగని 62 గ్రామ పంచాయతీలకు.. నిధులు కొనసాగించేలా నిబంధనలు ఉండాలి' అని విన్నవించారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

## మ్యూల్ ఖాతాల వేటలో 'ఏఐ'

### లక్షణాల ఆధారంగా బ్యాంకు ఎకౌంట్ల వడబోత
### సైబర్ నేరాల అదుపునకు ఆర్బీఐతో ఐ4సీ ఒప్పందం



**హైదరాబాద్ పెన్ పవర్:** సైబర్ నేరం జరిగి.. ఫిర్యాదు అందుకున్న తర్వాత దర్యాప్తు మొదలుపెట్టి సొమ్ము జమైన బ్యాంకు ఖాతా కలిగిన వ్యక్తిని చేరేటప్పటికే డబ్బు దేశం దాటిపోతోంది. దీంతో నిందితులను గుర్తించినా బాధితులకు న్యాయం చేయలేని పరిస్థితి. దీనికి చెక్ పెట్టేందుకు అధికారులు కృత్రిమ మేధ(ఏఐ) సాయం తీసుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల ఆయువుపట్టు మ్యూల్ ఖాతాల్లో(కమీషన్‌కు ఆశపడి ఇతరులకు ఇచ్చే బ్యాంకు ఖాతాల్లో) ఉంటుందని గుర్తించి వాటిపై దృష్టిపెట్టారు. ఇండియన్ సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) అధికారులు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం చేసుకుని 'మ్యూల్‌హంటర్-ఏఐ'ని రంగంలోకి దింపారు. తమ వద్ద నమోదైన కేసుల ఆధారంగా ఐ4సీ మ్యూల్ ఖాతాల తీరును నిర్ధారించింది. దీనికి అనుగుణంగానే మ్యూల్‌హంటర్ ఏఐను రూపొందించింది. దేశంలోని అన్ని బ్యాంకు ఖాతాలను ఇది వడపోస్తూ ఇలాంటి లక్షణాలు ఉన్న వాటిని గుర్తించి, అధికారులను అప్రమత్తం చేస్తుంది. అందువల్ల ఈ మధ్యకాలంలో వేలాది మ్యూల్ ఖాతాలను గుర్తించి జప్తు చేయగలుగుతున్నారు. గతంలో ఫిర్యాదు అందిన తర్వాత బాధితుడి డబ్బు ఏ ఖాతాలో జమ అయిందో తెలుసుకొని, ఆ ఖాతా వివరాలు ఆరా తీసి, అది మ్యూల్ ఖాతాగానే గుర్తించిన తర్వాతే జప్తు చేసేవారు. గడిచిన రెండేళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 27 లక్షల ఖాతాలు ఇలా జప్తు చేశారు. దీన్ని మరింత వేగిరం చేసేందుకు 'మ్యూల్‌హంటర్ ఏఐ' సాయం తీసుకుంటున్నారు.




సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో జూలై 2న ఇలా కూల్చివేతలు..

కబ్జాదారుల బరితెగింపుతో కూల్చిన నిర్మాణం, రాత్రికి రాత్రే మళ్ళీ గది నిర్మించారు..

## సర్వే నెం.333, 334లో కూల్చివేతలు..!

- కేసునమోదు చేసి, ఫెన్సింగ్ వేస్తామన్న కుత్బుల్లాపూర్ తహశీల్దార్..!
- 329 భూమి కబ్జా విషయంలో శుక్రవారం గజేంద్రపై కేసు నమోదుకు ఫిర్యాదు..

- గాజులరామారం సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు..
- గురువారం రెవెన్యూ కూల్చేసినప్పటికీ రాత్రికి రాత్రే మళ్ళీ రూము నిర్మాణం..!
- శుక్రవారం తహశీల్దార్ రాజేష్ ఆదేశాలతో ఆర్ఐ ఖలీమ్ పర్యవేక్షణలో కూల్చివేత..
- 2018 నుండి వివాదాస్పదంగా తయారైన ఈ రెండు(333,334) సర్వే నెంబర్‌లు..
- గతంలో సస్పెండ్ అయిన ఓ విఆర్ఏ కనుసన్నల్లో అక్రమ రిజిస్ట్రేషన్‌లు..
- ఈ వక్ఫ్ బోర్డు భూముల్లో కొత్తగా కబ్జాదారులు రంగంలోకి దిగారు..
- గాజులరామారం వక్ఫ్ భూములపై మరోసారి దృష్టి సారించిన రెవెన్యూ..!
- రెండు ఎకరాల స్థలానికి ఫెన్సింగ్..! కబ్జా దారులపై కేసులకు తహశీల్దార్ రాజేష్ సిద్ధం.

-4లో

## మూగబోయిన విప్లవ గొంతుక

### అనారోగ్యంతో అరుణోదయ నాగన్న కన్నుమూత



**హైదరాబాద్ పెన్ పవర్:** విప్లవ పాటలకు చిరునామాగా వెలుగొందిన అరుణోదయ నాగన్న ఇకలేరు. అరుణోదయ సాంస్కృతిక కళా సమాఖ్య వ్యవస్థాపక సభ్యుడు, ఆ సంస్థ ప్రస్తుత తెలంగాణ గౌరవాధ్యక్షుడు పరకాల నాగయ్య ఎలియాస్ అరుణోదయ నాగన్న(70) శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఖమ్మంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు అజయ్ ఉన్నారు. తిరుమలాయపాలెం మండలం రాజారాం గ్రామంలో పేద గీత కార్మికులైన పరకాల పాపయ్య, లక్ష్మమ్మ దంపతులకు నాగన్న జన్మించారు. 'అరుణోదయ' ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన నాగన్న... గిరిజన, పోడు భూముల సమస్యలపైనా గొంతువిప్పారు. సారా వ్యతిరేక పోరాటంలో... 'కొంగు నడుముకు చుట్టవే చెల్లెమ్మ' పాటతో మహిళల్లో ఉత్సాహం నింపారు. ధూంధాంలలో ఆడిపాడి తెలంగాణ ఉద్యమంలోనూ తనవంతు పాత్ర పోషించారు.

**నేడు వైద్యకళాశాలకు భౌతికకాయం అప్పగింత**

నాగన్న నేత్రాలను ఖమ్మం 'నేత్రనిధి' ప్రతినిధులు సేకరించారు. ఆయన భౌతికకాయాన్ని పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం తొలుత స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రానికి తర్వాత లెనిన్‌నగర్‌లోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయానికి తరలించారు. భౌతికకాయాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు శనివారం అప్పగిస్తామంటూ కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## ఒక ఇంటి కాపలా కాస్తూ పొరుగింటికి కన్నం.. రూ.25 లక్షల బంగారం, వెండి మాయం..

### ఛేదించిన అల్వాల్ పోలీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక ఇంటి కపాలాదారు పొరుగింటికి కన్నం వేసిన ఘటనను పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఊరు వెళ్లి వచ్చే లోపే ఇల్లు గుల్ల చేసి 25 లక్షల విలువైన బంగారం, వెండి మాయం చేసిన ఘటనలో.. నిందితులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ మచ్చబోల్లారం చంద్రపురి కాలనీకి చెందిన మేడిశెట్టి శ్యామ్ తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు ఇల్లు గుళ్ళయినట్లు పోలీసులు తెలిపారు. శ్యామ్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి జూన్ 3న స్వగ్రామానికి వెళ్లారు. దాదాపు మూడు వారాల అనంతరం జూన్ 27న ఇంటికి చేరుకున్నాడు. ప్రధాన ద్వారం తాళం, బెడ్‌రూమ్ బీరువా పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోనే ఉన్న తాళాలతో గోద్రేజ్ లాకర్ తెరిచి, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును అపహరించినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కరీంనగర్ కి మంచి రోజులొచ్చాయి... గెలిచిన 100 రోజుల్లోనే వందల కోట్ల నిధులు తెచ్చాం



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ( జులై 3 ) మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు బండి సంజయ్. తాను గెలిచిన 100 రోజుల్లోనే ప్రధాని మోడీని కలిసి వందలాది కోట్ల నిధులు తెచ్చామని... కరీంనగర్ కు మంచి రోజులొచ్చాయని అన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.80 కోట్లు కేటాయించామని..కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 10 వేల కోట్లు నిధులు తెచ్చానని అన్నారు బండి సంజయ్. దసరా వరకు వరంగల్ కరీంనగర్ హైవే ప్రారంభం అవుతుందని...మానేరుపై బ్రిడ్జి పనులను ప్రారంభిస్తున్నామని అన్నారు.అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై మంత్రి పొన్నం కు అవగాహన లేదని...దేశంలోనే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ 17 ప్రాజెక్ట్ లే వచ్చాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వరంగల్ కి మాత్రమే ప్రతిపాదన పంపిందని...తాను కరీంనగర్ కి కూడా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ తెచ్చానని అన్నారు. విబిజీ రాంజీ పై రాష్ట్రం ద్వంద్వ విధానం అవలంభిస్తోందని.. పథకం మంచిదే అంటూ కేసు వేస్తాం అంటున్నారని అన్నారు బండి సంజయ్.

## మధ్యలో కేటీఆర్ ఎవరు, హరీష్ ఎవరు..? నేను కేసీఆర్ కే సవాల్ విసురుతున్నా

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు, ప్రతిసవాళ్ళతో రాష్ట్రము దద్దరిల్లుతోంది. గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై ఇరు వర్గాల పరస్పర సవాళ్లతో గురువారం తెలంగాణ భవన్, గన్ పార్క్ దగ్గర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సవాళ్ల పర్వంలోకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఎంటర్ అయ్యారు. శుక్రవారం ( జులై 3 ) మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కే తన సవాల్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు భట్టి. రాష్ట్రాన్ని ఆగం చేసినవాళ్ళే ఏం మాట్లాడట్లేదని... మధ్యలో కేటీఆర్, కేసీఆర్ ఎవరు అంటూ ప్రశ్నించారు భట్టి. కేసీఆర్ అప్పులు చేసి ప్రజలపై భారం వేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం రూ.8 లక్షల 21 వేల కోట్ల అప్పులు చేసింది వాస్తవం కాదా అని అన్నారు భట్టి. అబద్దాలతో ఎంతకాలం మోసం చేస్తారని అన్నారు. ఈ అప్పులపై సమాధానం చెప్పాల్సింది కేసీఆరే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అప్పులపై వైట్ పేపర్ రిలీజ్ చేశామని...కేసీఆర్ చేసిన అప్పులకు రూ.2 లక్షల 8 వేల కోట్లు వడ్డీ కడుతున్నామని అన్నారు. రూ. 3 లక్షల కోట్లే అప్పు ఉందని

అబద్దాలు చెబుతున్నారని అన్నారు భట్టి. బీఆర్ఎస్ హయాంలో 10.5 శాతం వడ్డీకి అడ్డగోలుగా అప్పు తెచ్చారని... తమ ప్రభుత్వం వచ్చాక రిస్ట్రక్చర్ చేసి 7.5 శాతానికి తగ్గించామని అన్నారు భట్టి.






- గాజులరామారం సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు..
- గురువారం రెవెన్యూ కూల్చేసినప్పటికీ రాత్రికి రాత్రే మళ్ళీ రూము నిర్మాణం..!
- శుక్రవారం తహశీల్దార్ రాజేష్ ఆదేశాలతో ఆర్ఐ ఖలీమ్ పర్యవేక్షణలో కూల్చివేత..
- 2018 నుండి వివాదాస్పదంగా తయారైన ఈ రెండు(333,334) సర్వే నెంబర్‌లు..
- గతంలో సస్పెండ్ అయిన ఓ విఆర్ఏ కనుసన్నల్లో అక్రమ రిజిస్ట్రేషన్‌లు..
- ఈ వక్ఫ్ బోర్డు భూముల్లో కొత్తగా కబ్జాదారులు రంగంలోకి దిగారు..
- గాజులరామారం వక్ఫ్ భూములపై మరోసారి దృష్టి సారించిన రెవెన్యూ..!
- రెండు ఎకరాల స్థలానికి ఫెన్సింగ్..! కబ్జా దారులపై కేసులకు తహశీల్దార్ రాజేష్ సిద్ధం.

సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో జూలై 2న ఇలా కూల్చివేతలు..




# సర్వే నెం.333, 334లో కూల్చివేతలు..!

## •కేసునమోదు చేసి, ఫెన్సింగ్ వేస్తామన్న కుత్బుల్లాపూర్ తహశీల్దార్..!
## •329 భూమి కబ్జా విషయంలో శుక్రవారం గజేంద్రపై కేసు నమోదుకు ఫిర్యాదు..


కబ్జాదారుల బరితెగింపుతో కూల్చిన నిర్మాణం, రాత్రికి రాత్రే మళ్ళీ గది నిర్మించారు..

**గాజులరామారం సర్వే నెం.333, 334 భూముల్లో, 2018 లోనే మల్లిఖార్జున రెడ్డి, రాజారెడ్డి, మరో వ్యక్తి వెంచర్ నిర్మాణానికి పనులు ముమ్మరం చేశారు.. అప్పట్లో ఓ ఇంగ్లీష్ పత్రికలో ఈ కబ్జా వ్యవహారంపై వచ్చిన ప్రత్యేక వార్తా కథనంతో..! వక్ఫ్ బోర్డు అధికారులు కబ్జా స్థలాన్ని సందర్శించారు.. అప్పటి నుండి కబ్జాలకు బ్రేక్ పడినా..! గతంలో రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వర్తించి సస్పెండ్ అయిన ఓ విఆర్ఏ, రెవెన్యూ మెలకువలు తెలుసుకుని ఫేక్ ఓఆర్‌సి(రద్దైన ఓఆర్‌సి)తో అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి.. తాజాగా మరికొందరు ఈ సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ ఖలీమ్ పర్యవేక్షణలో అక్రమ గదులను కూల్చేశారు..**

**333, 334కి ఫెన్సింగ్ వేస్తాం..! కేసు నమోదు చేస్తాం..!**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం లోని ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారంలో, ఉపేక్షించేది లేదని, కబ్జాదారులను తహశీల్దార్ రాజేష్ తీవ్రంగా హెచ్చరించారు.. గత నాలుగు రోజులుగా సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో బేస్మెంట్ నిర్మాణం తొలగించినా పదే పదే కబ్జాకు పాల్పడిన గజేంద్ర అనే వ్యక్తిపై కేసునమోదుకు ఫిర్యాదు చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.. అదేవిధంగా సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో గదులు నిర్మిస్తుండగా గురువారం ఆర్ఐ ఖలీమ్ కూల్చేసినా.. రాత్రికి రాత్రే మళ్ళీ రూమును నిర్మించడంపై తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. సంబంధిత అక్రమ నిర్మాణాన్ని, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం మరోసారి కూల్చేశారు.. ఈ విషయంపై పెన్ పవర్ ప్రతినిధి కుత్బుల్లాపూర్ తహశీల్దార్‌తో సర్వే నెంబర్ 333, 334 భూముల కబ్జాలను ప్రస్తావించగా..! ఆయన తీవ్రంగా స్పందించారు.. కబ్జాదారులపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.. అదేవిధంగా సంబంధిత రెండు సర్వే నెంబర్‌ల స్థలానికి ఫెన్సింగ్ వేస్తామని తెలిపారు..


**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, జూలై 3:** కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామం శివారులోని వక్ఫ్ బోర్డు భూములపై జరుగుతున్న తాజా ఆక్రమణల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది.. సర్వే నెంబర్ 333, 334లో సుమారు రెండు ఎకరాల వక్ఫ్ బోర్డు, ప్రభుత్వ స్థలానికి త్వరలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్ 'పెన్ పవర్' ప్రతినిధికి తెలిపారు.గాజులరామారం లోని ఇదే సర్వే నంబర్లకు సంబంధించి గతంలోనే 2018లో వక్ఫ్ బోర్డు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ శాఖలు పలుమార్లు చర్యలు చేపట్టాయి.. 2019లో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం వక్ఫ్ బోర్డుకు లేఖ రాసి సర్వే నెంబర్లు 1, 94, 97, 107, 140, 141, 201, 215 నుంచి 225, 255, 256, 306, 307, 320 నుంచి 327, 330 నుంచి 339, 453లోని వక్ఫ్ భూములకు ఎలాంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయవద్దని స్పష్టం చేసింది.. భూముల సరిహద్దులు గుర్తించి అప్పగించాలని కూడా వక్ఫ్ బోర్డును కోరింది.. అనంతరం సర్వే నెంబర్లు 333, 334లో ఇనాం భూములకు ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికేట్ (ఓఆర్‌సి) జారీ అంశంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టగా, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డును కూడా ప్రతివాదిగా చేర్చారు. తదనంతరం 2024లో హైకోర్టు ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు అధికారులు విచారణకు హాజరై సంబంధిత రికార్డులు, గెజిట్ నోటిఫికేషన్లు, సర్వే వివరాలను సమర్పించాలని బోర్డు ప్రత్యేక మెమో జారీ చేసింది..ఈ నేపథ్యంలో ప్రస్తుతం అదే సర్వే నంబర్ల పరిధిలో మరోసారి కబ్జాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు.. రెండు ఎకరాల వక్ఫ్, ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణలను అడ్డుకోవడం తోపాటు కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్ తెలిపారు.. స్థానికులు కూడా వక్ఫ్, ప్రభుత్వ భూములను శాశ్వతంగా పరిరక్షించేందుకు సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ పూర్తి చేయాలని, అక్రమ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు..



రాత్రికి రాత్రే నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది కూల్చేశారు..

## సర్వే నెం.333, 334లోనే..! 2018 నాటి చర్యల ఫైల్‌ఫొటోలు..!


పనులను అడ్డుకున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ.. అప్పటి విఆర్‌వో బాలరాజు డిమాలిషన్.. (ఫైల్‌ఫొటో)




పెద్ద రాతిబండపై సర్వే నెం.333, 334 వక్ఫ్ బోర్డు స్థలం ఉన్నది పరిశీలిస్తున్న వక్ఫ్ సిబ్బంది.. (ఫైల్‌ఫొటో)


2018 లో సర్వే నెం.333, 334 వక్ఫ్ బోర్డు భూముల్లో వెంచర్ పనులు.. (ఫైల్‌ఫొటో)




2018లో జేసిబి- ఇటాచీలతో తవకాలు, టిప్పర్‌లతో మట్టి తరలింపు..(ఫైల్‌ఫొటో)



# పార్లమెంట్‌లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్-థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చునేది బీజేపీ ఆలోచనగా ఉంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సొంత రాష్ట్రంలోనే పట్టు కోల్పయిన సంతోష్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ లో అత్యంత శక్తివంతమైన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుండి బీఎల్ సంతోష్ ను తప్పించి, తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత చక్రం తిప్పిన సంతోష్, ఇటీవల కాలంలో మోదీ-షాల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా కీలక ఎన్నికల్లో ఆయన అనుసరించిన ఏకపక్ష వ్యూహాలు పార్టీకి భారీ నష్టాన్ని చేకూర్చడమే కాకుండా, శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీయడం వల్లే ఈ నిర్ణయమని అంటున్నారు.బీఎల్ సంతోష్‌పై మోదీ-షాలకు నమ్మకం సడలడానికి ప్రధాన కారణం ఆయన సొంత రాష్ట్రమైన కర్ణాటక. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బలమైన మాస్ లీడర్, లింగాయత్ దిగ్గజం బీఎస్ యడియూరప్ప ప్రభావాన్ని తగ్గించేందుకు సంతోష్ గట్టిగా ప్రయత్నించడం. టికెట్ల కేటాయింపులో యడియూరప్ప వర్గాన్ని పక్కనబెట్టి, కేవలం సిద్ధాంతాల ప్రాతిపదికన కొత్తవారికి సీట్లు ఇవ్వాలనే సంతోష్ పట్టుదల కారణంగా పార్టీ అక్కడ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్షేత్రస్థాయి రియాలిటీని కాదని, కేవలం తన ఇగో కోసమే సంతోష్ తీసుకున్న నిర్ణయాలు దక్షిణ భారతదేశంలో బీజేపీ ఏకైక కోటను కూల్చేశాయని, దీనిని మోదీ-షాలు ఇప్పటికీ క్షమించలేకపోతున్నారని అంటున్నారు.బీఎల్ సంతోష్ సంస్థాగత కార్యదర్శిగా ఉన్నప్పటికీ, మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్‌కు, బీజేపీ అధినాయకత్వానికి మధ్య సరైన సఖ్యత ఏర్పాటు చేయలేకపోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఆరెస్సెస్ గ్రౌండ్ క్యాడర్‌తో సమన్వయం చేసుకోవడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీలో తన పట్టును నిలుపుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల గత సార్వత్రిక ఎన్నికల్లో చాలా చోట్ల ఆరెస్సెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయలేదు, ఫలితంగా బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ సాధించలేక కూటమిపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ తీవ్రమైన సమన్వయ లోపం నేరుగా ప్రధాని మోదీ గ్రాఫ్‌పైనే ప్రభావం చూపడంతో, ఆరెస్సెస్ అగ్రనాయకత్వం కూడా సంతోష్‌ను మార్చడమే శ్రేయస్కరమని ఢిల్లీ పెద్దలకు సూచించినట్లు టాక్.బీఎల్ సంతోష్ వర్కింగ్ స్టైల్ చాలా కఠినంగా, రాష్ట్ర స్థాయి నాయకులను అణచివేసేలా ఉంటుందనే ఫిర్యాదులు మోదీ, అమిత్ షాల వద్దకు వెల్లువలా చేరాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నియామకాల్లో కానీ, స్థానిక వ్యూహాల అమలులో కానీ ఆయన స్థానిక నేతలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది. అధికారం కేంద్రీకృతం కావడం వల్ల కొత్త నాయకత్వం ఎదగకుండా పోతోందని అధిష్ఠానం గుర్తించింది. ప్రధాని మోదీ 3.0 హయాంలో పార్టీని మరింత ఆధునికంగా, అందరినీ కలుపుపోయేలా తీర్చిదిద్దే క్రమంలో.. వివాదాలకు కేంద్రబిందువుగా మారిన బీఎల్ సంతోష్ శకానికి స్వస్తి పలకడమే ఉత్తమమని మోదీ-షాల ద్వయం భావించి, ఆయనను సున్నితంగా సంఘ్‌కు పంపేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని అంటున్నారు.

## ఒక ఇంటి కాపలా కాస్తూ పొరుగింటికి కన్నం.. రూ.25 లక్షల బంగారం, వెండి మాయం..

-3 పేజి తరువాయి

ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అల్వాల్ పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సీసీ కెమెరాలలో ఇంట్లో పని చేసే వాచ్మెన్ చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. అల్వాల్ ప్రాంతానికి చెందిన వాచ్మెన్ కొల్లి లోవరాజు, పాపాని రాజు, మైలారం మహేష్ చారి ల సహకారంతో పక్కా ప్రణాళిక ప్రకారం చోరీకి పాల్పడ్డట్లు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి స్పష్టం చేశారు. ప్రధాన నిందితుడు కొల్లి లోవరాజు బాధితుడి ఇంటికి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. బాధిత కుటుంబం స్వగ్రామానికి వెళ్లిన విషయం, ఇంట్లో ఎవరూ లేరన్న సమాచారాన్ని ముందుగానే తెలుసుకుని ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువా పగులగొట్టి ఇంట్లోనే ఉన్న తాళాలతో లాకర్ తెరిచి విలువైన ఆభరణాలు, నగదును అపహరించాడు. అనంతరం దొంగిలించిన బంగారం, వెండి వస్తువులను పాపాని రాజు, స్వర్ణకారుడు మహేష్ చారికి విక్రయించినట్లు విచారణలో తేలింది. నిందితుల నుండి 20 లక్షల విలువైన 13 తులాల బంగారంతో పాటు 330 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు బేగంపేట ఏసీపి గోపాలకృష్ణమూర్తి తెలిపారు.

# హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త ఛార్జీల ప్లాన్.. ప్రయాణికులపై ప్రభావం ఇదే

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణించే వారికి త్వరలో కొత్త షాక్ తగలనుంది. ఇప్పటి వరకు విమానంలో బయలుదేరే ప్రయాణికులే యూజర్ డెవలప్‌మెంట్ ఫీజు(ఖణఖీ) చెల్లిస్తుండగా, ఇకపై విమానం దిగే ప్రయాణికులపై కూడా ఛార్జీలు విధించే ప్రతిపాదన ఒకటి కొత్తగా తెరపైకి వచ్చింది. అయితే మొత్తం ఛార్జీ పెరగడం కాదు.. చెల్లింపు విధానంలో మార్పు తీసుకురావడమే ఈ ప్రతిపాదన ప్రత్యేకత అని తెలుస్తోంది. ప్రస్తుతం దేశీయ ప్రయాణికులు బయలుదేరేటప్పుడు రూ.750, అంతర్జాతీయ ప్రయాణికులు రూ.1,500 యూజర్ ఫీజులు చెల్లిస్తున్నారు. కొత్త ప్రతిపాదన ప్రకారం దేశీయ ప్రయాణికులు బయలుదేరేటప్పుడు రూ.580, తిరిగి హైదరాబాద్ ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయ్యాక రూ.170 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అంతర్జాతీయ ప్రయాణికులు బయలుదేరేటప్పుడు రూ.1,150, చేరుకున్న తర్వాత రూ.350 చెల్లించాల్సి ఉంటుంది. అంటే మొత్తం చెల్లించాల్సిన పేమెంట్ యథాతథంగానే ఉన్నా.. బయలుదేరే సమయంలో పడే భారం తగ్గనుంది.


**ప్రయాణికులపై ప్రభావం..**

ఈ మార్పుతో ప్రయాణికులు టికెట్ బుకింగ్ సమయంలో చెల్లించే ఛార్జీల నిర్మాణంలో మార్పు కనిపించనుంది. బయలుదేరే సమయంలో చెల్లించాల్సిన మొత్తం తగ్గడంతో కొంత ఊరట లభించినా, తిరిగి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కూడా ఖణఖీ చెల్లించాల్సి రావడం కొత్త అంశం. ఇతర ప్రధాన విమానాశ్రయాల్లో ఇప్పటికే ఈ విధానం అమల్లో ఉండటంతో.. హైదరాబాద్‌లోనూ అదే పద్ధతిని తీసుకురావాలని విమానాశ్రయ యాజమాన్యం భావిస్తోంది.

**2030 తర్వాత మరింత ఊరట..**

ఈ ప్రతిపాదనకు అనుమతి లభిస్తే 2030 వరకు ఇదే ఛార్జీలు అమల్లో ఉంటాయి. అయితే 2030-31లో దేశీయ ప్రయాణికులకు మొత్తం ఖణఖీను రూ.520కు, అంతర్జాతీయ ప్రయాణికులకు రూ.1,140కు తగ్గించే ప్రణాళికను కూడా సంస్థ వెల్లడించింది. దీంతో ప్రస్తుతం ఉన్న రేట్లతో పోలిస్తే భారీ తగ్గుదల ఉండే అవకాశం ఉంది.హైదరాబాద్ విమానాశ్రయం రాబోయే మూడు నుంచి నాలుగేళ్లలో సుమారు రూ.13వేల 975 కోట్లతో కొత్త టెర్మినల్, కొత్త రన్‌వే నిర్మించేందుకు సిద్ధమవుతోంది. 2031 నాటికి సంవత్సరానికి 5 కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే లక్ష్యంతో ఈ విస్తరణ చేపడుతోంది. కొత్తగా దేశీయ, అంతర్జాతీయ, కార్గో రూట్లను ప్రారంభించే విమానయాన సంస్థలకు ల్యాండింగ్ ఛార్జీల్లో భారీ రాయితీలు ఇవ్వాలని కూడా ప్రతిపాదించింది.ప్రస్తుతం ఇవన్నీ ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. విమానాశ్రయ ఆర్థిక నియంత్రణ సంస్థ ప్రజాభిప్రాయాలు, సాంకేతిక అంశాలను పరిశీలించి ఫైనల్ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కొత్త ఛార్జీలు అమల్లోకి వస్తాయి. అప్పటి వరకు ప్రస్తుతం అమల్లో ఉన్న ఫీజులే కొనసాగుతాయి.

# రిటైర్డ్ ఉద్యోగుల జీవన భద్రతకు ముప్పు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ ఉద్యోగి తన జీవితకాల కష్టార్జితాన్ని, రెక్కల కష్టాన్ని నమ్ముకుని, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకునే ప్రధాన వనరు -- రిటైర్మెంట్ బెనిఫిట్స్. పిల్లల చదువులు, కుమార్తెల పెండ్లిళ్లు, ఇల్లు కట్టుకోవడం లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం వారు ఈ సొమ్మునే ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో దశాబ్దాల పాటు సేవలు అందించి, రిటైరైన ఉద్యోగులు తమ సొంత సొమ్మును కూడా సకాలంలో తీసుకోలేక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు మూడేండ్లు కావస్తున్నా తమకు పూర్తి మొత్తంలో రావాల్సిన బకాయిలు అందక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతంగా జీవితాన్ని గడుపుదామనుకునే వారికి ప్రభుత్వ ఉదాసీనత వల్ల తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వం నుంచి రావలసిన ప్రధాన బెనిఫిట్లు నిలిచిపోవడంతో వృద్ధాప్యంలోనూ ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు దాపురించాయి. 2024 ఏప్రిల్ నుంచి రిటైరైన సుమారు 10 వేల మందికి పైగా ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలు పూర్తిగా నిలిచిపోయాయి. తీవ్ర ఒత్తిడి, కోర్టు కేసుల నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్లలో కేవలం 30-50 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సర్కార్ పెండింగ్‌లో పెట్టింది. అరకొర చెల్లింపుల వల్ల తమ అవసరాలు ఏమాత్రం తీరక రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాత్రమే కాకుండా, గతంలో రావాల్సిన ఇతర ఆర్థిక ప్రయోజనాలు కూడా వారికి నిలిచిపోయాయి. తాము ప్రతి నెలా జీతం నుంచి పొదుపు చేసుకున్న జీపీఎఫ్ నిధులను సైతం నిలిపివేయడం శోచనీయమని ఆవేదన చెందుతున్నారు. టీఎస్‌జీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, తెలంగాణ స్టేట్ ఇన్సూరెన్స్, జీఐఎస్ బకాయిలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. గ్రాట్యుటీ క్రెడిట్ చేయకుండా కేవలం కమ్యూటేషన్ మాత్రమే వేయడంపై తీవ్ర చర్చ జరుగుతున్నది. వాస్తవానికి కమ్యూటేషన్ ఇచ్చిన మరుసటి నెల నుంచే పెన్షన్‌లో దాదాపు 40 శాతం వరకు రికవరీ జరుగుతుంది. గ్రాట్యుటీ రాకుండా పెన్షన్ మొత్తం తగ్గిపోవడంతో పెద్ద ఆర్థిక భారంగా మిగులుతున్నది. ఎర్న్డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీవితాంతం దాచుకున్న 300 రోజుల సంపాదిత సెలవుల నగదు బిల్లులు కూడా చాలామందివి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పాత పీఆర్సీ బకాయిలు ఇప్పటికీ ఎంతోమందికి పూర్తి స్థాయిలో అందలేదు. గత రెండు నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల జీతాలు/పెన్షన్ల నుంచి ఈహెచ్‌ఎస్ పేరిట రికవరీ చేస్తున్నా, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించే హెల్త్ కార్డ్స్ ఇప్పటికీ అందలేదు. దీనివల్ల వృద్ధాప్యంలో అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఆరు నెలల్లో అమలు చేస్తామన్న పీఆర్సీ, నెలలు గడుస్తున్నా కనీసం నివేదిక కూడా బయటకు రాకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. 2024 జనవరి నుంచి రావలసిన సుమారు 6 డీఏ బకాయిల మంజూరులో తీవ్ర ఆలస్యమవుతున్నది. విశ్రాంత ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడకుండా ఉండాలంటే..ఉద్యోగ విరమణ చేసిన నెలలోపే వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను అందించాలి. ఇది వారి ప్రాథమిక హక్కుగా పరిగణించాలి. రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో గౌరవంగా, ఆర్థిక భద్రతతో జీవించేలా చూడటం ప్రభుత్వ కనీస బాధ్యత. వారి చట్టబద్ధమైన హక్కులను కాపాడటానికి, జీవితాంతం దాచుకున్న సొమ్మును సకాలంలో అందించడానికి వెంటనే స్పందించి, తగిన తక్షణ చర్యలు చేపట్టాలి. అత్యవసర అవసరాల కోసం తాత్కాలిక రుణాలు, జీపీఎఫ్ పాక్షిక ఉపసంహరణలకు తక్షణ అనుమతులు మంజూరు చేయాలి. జీపీఎఫ్ ఫైనల్ క్లోజర్ మొత్తంతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల జీవన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.

# కొత్త అవతారంలో నరేగా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా నిరుడు డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించిన వీబీ-- జీ రాం జీ చట్టం బుధవారం నుంచి అమల్లోకొచ్చింది. ఇది రద్దయిన ఉపాధి హామీ పథకం (నరేగా)కు సరికొత్త అవతారం. గత పథకంలోని 'హక్కుల ప్రాతిపదిక'ను మార్చొద్దనీ, రాష్ట్రాలపై ఆర్థిక భారం పడే విధానానికి స్వస్తిచెప్పి, గతంలో మాదిరే కేంద్రమే భరించాలని పౌరసమాజ కార్యకర్తలతోపాటు కొన్ని రాష్ట్రాలు కూడా కోరాయి. అయితే నరేగా కన్నా ఇదెన్నో రెట్లు మేలని కేంద్రం చెబుతోంది. గత పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి వంద రోజుల పని దినాలకు అనుమతించగా, తాము మరో 25 రోజులు పెంచామని... కూలీల వేతనాలు పెరిగాయని, వారానికోసారి చెల్లింపులు, ఇతర సంస్కరణలు తీసుకురావటంతో అవినీతికి ఆస్కారం ఉండబోదని కేంద్రం చెబుతోంది. పాత పథకంలో ప్రతి 15 రోజులకొకసారి చెల్లించాలన్న నిబంధన ఉన్నా, బ్యాంకింగ్ సదుపాయాలు అంతంతమాత్రమే కావటంవల్ల నిరుపేద కుటుంబాలు నెలల తరబడి వేచిచూడాల్సివచ్చేది. ఈలోగా రోజులు గడవటానికి అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేసే వారు. ఇప్పుడు వారానికొకసారి వేతనాలిస్తామంటున్నా ఈ లోటు పాట్లు సరిదిద్దకపోతే నిరుపయోగమే. గ్రామీణ కూలీలకు మరో 25 రోజులు పనిదొరకటం, అందువల్ల అదనపు ఆదాయం రావటం హర్షించదగ్గది. అయితే నరేగాకింద గ్రామాల్లో సంబంధిత పక్షాల సమావేశాల నిర్ణయాల ఆధారంగా చేయించాల్సిన పనులు ఖరారయ్యేవి. తాజా చట్టం ప్రకారం అలాంటి పనులేమిటో కేంద్రం 'వాస్తవ ప్రమాణాల' ఆధారంగా నిర్ణయిస్తుంది. దాని కయ్యే వ్యయాన్ని కూడా అంచనా వేస్తుంది. అందులో 40 శాతాన్ని రాష్ట్రం భరిస్తే, మిగి లిన 60 శాతం నిధులు కేంద్రంనుంచి వస్తాయి. చేయించాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం ఆధారంగా వివిధ రాష్ట్రాలకు వేర్వేరు కేటాయింపులుంటాయి. కేంద్రం నిర్దేశించిన పనుల కన్నా అధికంగా చేయించదల్చుకుంటే అందుకయ్యే మొత్తం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. పాత పథకంలో నిధుల దుర్వినియోగం మాట వాస్తవం. కనబడని మనుషుల పేర్లతో కైంకర్యం చేసిన ఉదంతాలు అనేకం బయటపడ్డాయి. అందుకే హిందీ రాష్ట్రాల్లో 'పిశాచ లబ్ధిదారుల'న్న పేరు కూడా వచ్చింది. అయితే ఇప్పుడున్న సాంకేతికత అప్పుడు లేదు. మొత్తం కాగితాలపైనే వ్యవహారాలన్నీ నడిచేవి. ఆన్‌లైన్ వ్యవస్థలు, డిజిటల్ చెల్లింపులు వచ్చాక ఆ బెడద తగ్గింది. 'నరేగా'ను అవినీతి పేరుతో కొట్టిపారేయటం సరికాదు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2006లో ప్రారంభమైన ఈ పథకం తొలి దశాబ్దకాలంలో దాదాపు కోటిన్నరమంది ప్రజలను దారిద్ర్యంనుంచి విముక్తుల్ని చేసింది. ఇది చిన్న విషయమేం కాదు. అలాగే సగటున మహిళలకు 50 శాతం పనులు దక్కేవి. ఈ పథకంవల్ల సాగు పనులకు కూలీల కొరత వస్తున్నదన్న ఫిర్యాదులు ఉండేవి. కానీ జాతీయ గణాంకాలు మాత్రం సాగు పనులు ముమ్మరంగా ఉండే సమయంలో 'నరేగా'కు డిమాండ్ తక్కువేనని చెబుతున్నాయి. కూలీలకు బేరమాడే శక్తి పెరిగిందనీ, వారి కూలీ రేట్లు పెరిగాయనీ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ంకొత్త పథకంలో రాష్ట్రాలు కూడా వ్యయం భరించాల్సిరావటం ఒకరకంగా విషాదం. 'నిధులు నిండుకుంటే హక్కులు నీరసిస్తాయ'ని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. ఈ పథ కానికి కేటాయింపుల కోసం రాష్ట్రాలు ముందుగా సంక్షేమ పథకాలకే... మహిళా సంక్షేమానికే కోత పెడతాయి. గతంలో నిధులు లేక కాదు... అమలుపై ఆసక్తి కొరవడి అత్యధిక పేదరికం ఉండే బిహార్, ఉత్తరప్రదేశ్‌లు అతి తక్కువ నిధులు వినియోగించాయని గణాంకాలు సూచిస్తున్నాయి. ఇప్పుడు నిధుల లేమితో చాలా రాష్ట్రాలు ఆ తోవన పోయినా ఆశ్చర్యం లేదు. మొన్న ఏప్రిల్ సమావేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, బిహార్‌లతోపాటు జార్ఖండ్, ఉత్తరాఖండ్, తెలంగాణలు నిధుల భారం మోపటాన్ని వ్యతి రేకించాయి. తాజాగా తమిళనాడు సీఎం విజయ్ కూడా గొంతుకలిపారు. ఆశ్చర్యకరంగా ఆంధ్రప్రదేశ్ మాత్రం నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోయింది. ఎటూ సంక్షేమాన్ని అరకొరగా చేస్తున్నాం... దాన్ని మరింత కత్తిరిస్తే సరిపోతుందని సీఎం చంద్రబాబు నాయుడు అనుకుంటున్నట్టున్నారు. ఏదేమైనా ఆచరణలో వచ్చే సమస్యల్ని అధ్యయనం చేశాకైనా వీబీ-- జీ రాం జీ ని మెరుగుపరచటం మేలు.

# వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దాం

**హైదరాబాద్ పెన్ పవర్:** వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వచ్చే ఏడాది మార్చి నెలలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం వనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయంలో దాదాపు ఏడు కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ బ్రహ్మోత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలుగా మాత్రమే కాకుండా, వనపర్తి పట్టణ ప్రతిష్టను చాటిచెప్పే 0మహోత్సవాలుగా నిలిచేలా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భక్తి భావం, సేవా తత్పరత కలిగిన పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఉద్యోగస్తులు, అధికారులు, అనధికారులు, యువత, మహిళలు సహా ప్రతి ఒక్కరూ ఈ మహోత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్య ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు హాజరయ్యే అవకాశముందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం రూ. 6 కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. వచ్చే మార్చిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మనకు ఇంకా సుమారు ఏడు నెలల సమయం ఉన్నందున ప్రతి నెలా ఒక సమీక్షా సమావేశం నిర్వహిస్తూ, కార్యక్రమాలను దశలవారీగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, గతంలో ఎన్నడూ లేని విధంగా "నా భూతో న భవిష్యత్" అన్న స్థాయిలో ఈ



వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామూహిక సేవా భావాలకు ప్రతీకగా నిలిచే ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త రఘునాథచార్యులు, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కదిరే రాములు, పట్టణ కౌన్సిలర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమం, సాధికారతకు కేంద్రం పెద్దపీట

**బండి సంజయ్**

**మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం**

**-డాక్టర్ కవ్వంపల్లి**

**కరీంనగర్ పెన్ పవర్:** మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేంద్రం పాటుపడుతోం దని, ఉజ్వల పథకంలో భాగంగా 11 కోట్ల గ్యాస్ కనెక్షన్లు మహిళలకు ఇచ్చామని చెప్పారు. త్వరలో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు తీసుకు వస్తామన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా మహిళలకు విడుతల వారీగా ఆటోలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. గూడ్స్ ఆటోలు మన కరీంనగర్ లో మాత్రమే నడుస్తున్నాయని, వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయన్నారు. అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు మంచి చేయాలని చూస్తుందని, అయితే గత పాలకులు మాత్రం ఇందుకు భిన్నంగా పని చేశారని, గత పాలకులకు మహిళలను ప్రోత్సహించాలన్న సోయి లేకుండా పోయిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు కొని ఇవ్వడమే కాకుండా పదో తరగతి చదివిన విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టిన విషయాన్ని బండి సంజయ్ కుమార్ గుర్తు చేశారు.



మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం : డాక్టర్ కవ్వంపల్లిఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా మహిళలను తీర్చిదద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. మహిళా సంఘాలకు రూ. 10లక్షల రుణంతో పాటు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. మహిళల్లో కష్టపడే తత్వం మెండుగా ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలతో వారు సత్ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు,కార్యక్రమాలన్నీ మహిళా ప్రాంగణం ద్వారా ప్రవేశపెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మహిళలను బలోపేతం చేసేలా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న సహాయం, చేస్తున్న కృషి ఎంతో గొప్పదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. 7

# ఏదుల రిజర్వాయర్ ముంపు బాధితులకు రూ.2.34 కోట్ల చెక్కుల పంపిణీ

## 47 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.

**హైదరాబాద్ పెన్ పవర్:** వనపర్తి నియోజకవర్గంలోని ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ముంపుకు గురైన కొంకలపల్లి గ్రామానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 2 కోట్ల 34 లక్షలను మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డినపర్తి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు సత్తి చేసిన కార్యక్రమంలో సంబంధిత లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి తమ పొలాలు, ఇండ్లు కోల్పోయి పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చిందని, ఎన్నో
ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ గత పాలకులు తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి ప్రతి కుటుంబానికి నష్టపరిహారం అందజేయడం ఆనందదాయకమని, తమకు న్యాయం జరుగుతోందనే నమ్మకం కలిగిందని లబ్ధిదారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. పొలాలు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ముంపు బాధిత



కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గోపాల్పేట ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సత్య శీలా రెడ్డి, రేవల్లి మండల అధ్యక్షు లు సుల్తాన్ గ్రామ సర్పంచ్ బాలనాగయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు పర్వతాలు, లోడి రఘు, ఆర్డీఓ ఎంఆర్ఓ, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం, తారకరామ నగరలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాశ్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ -2026 లో భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా కి ప్రస్తుత ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను నాణ్యమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యం అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో సర్వే పూర్తి చేసి ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఎ లు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా పర్యటన విజయవంతం...

**ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు కి రేణిగుంటలో ఘన వీడ్కోలు?**

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి జిల్లాలో మూడు రోజుల పాటు సాగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసింది. జిల్లాలో పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, ప్రజల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపిన ముఖ్యమంత్రి ఈరోజు తిరుగుప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆయనకు గౌరవపూర్వకంగా సాదర వీడ్కోలు పలికారు. ?మన కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రగతి కోసం, ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు ఆయన పడుతున్న తపన ప్రశంసనీయం. ఈ క్రమంలోనే, నిరంతరం ప్రజా సేవలో గడుపుతున్న ముఖ్యమంత్రి కి ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల తరఫున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ?చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో మన శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాము. ముఖ్యమంత్రి విజన్‌కు అనుగుణంగా శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి మేము నిరంతరం కట్టుబడి ఉంటాం. ?ఈ వీడ్కోలు కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖులు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి కి ఘన వీడ్కోలు పలికారు. చంద్రబాబు పర్యటన విజయవంతం కావడం పట్ల జిల్లా అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏపీని ఉక్కు రాష్ట్రంగా మారుస్తున్నాం సీఎం చంద్రబాబు నాయుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు దశాబ్దాల రాయలసీమ ప్రజల కల ఈరోజు నెరవేరిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సీమ ఖనిజ సంపద... సీమ అభివృద్ధికే వినియోగించాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని సున్నపురాళ్లపల్లిలో 'జేఎస్డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్' పనులు ప్రారంభించి నిజం చేశాం. దీనికి అనుబంధంగా 'నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు'కు, అలాగే విజయనగరం జిల్లాలోని 'జేఎస్డబ్ల్యూ పారిశ్రామిక పార్కు'కు కూడా శంకుస్థాపన చేసుకున్నాం. గత ప్రభుత్వంలో కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టి ప్రజలను మభ్యపెడితే... మేం పనులు మొదలుపెట్టి రాయలసీమ స్టీల్ ప్లాంటుకు వాస్తవరూపం ఇస్తున్నాం. 2028 నాటికి ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్ నిర్మాణం పనులు ఈరోజు నుంచి జరుగుతాయి. స్టీల్ ప్లాంట్ రాకతో కడపజిల్లా వేగంగా అభివృద్ధి చెందడమే కాకుండా, వేలాది మంది యువతకు ఉద్యోగాలు దక్కుతాయి. అటు విశాఖ స్టీల్ ప్లాంట్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్... ఇటు జేఎస్డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్తో ఆంధ్రప్రదేశ్ను ఉక్కు రాష్ట్రంగా మారుస్తున్నాని అన్నారు.

## అప్పులపై సమాధానం చెప్పాల్సింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే

**ఉపముఖ్య మంత్రి భట్టి**

**హైదరాబాద్ పెన్ పవర్:** కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల్లోనే గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి రూ. 2,08,681 కోట్లు చెల్లించాం. అదే సమయంలో ఉద్యోగుల జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాలు నిరంతరంగా అమలు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచాం. అధిక వడ్డీ అప్పులను డెట్ రీస్ట్రక్చరింగ్ ద్వారా పునర్వ్యవస్థీకరించి, 2031-32 వరకు చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల భారాన్ని రూ. 11,915 కోట్లకు తగ్గించాం. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ. 22,142 కోట్ల ఆదా కలిగిందని అన్నారు. ప్రజల డబ్బును కాపాడుతూ, బాధ్యతాయుత ఆర్థిక నిర్వహణతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నాం. పదేళ్ల పాలనలో రాష్ట్రంపై చేసిన అప్పులపై సమాధానం చెప్పాల్సింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే అని అన్నారు. ఎఫ్ఆర్ బీఎం రుణాలు, ప్రభుత్వ హామీతో కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, డిస్కంలు తదితర సంస్థలకు పెండింగ్లు కలిపి రాష్ట్రంపై రూ. 8,21,651 కోట్ల భారం మోపింది వాస్తవం కాదా? ఈ లెక్కలన్నీ అధికారిక రికార్డుల్లో ఉన్నాయి. అసెంబ్లీలో వైట్ పేపర్ సమర్పించి ప్రజల ముందుంచాం. వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నాల కంటే ప్రజలకు నిజాలు చెప్పే బాధ్యత మాజీ ప్రభుత్వానిదే నని అయన అన్నారు.

## తప్పిపోయిన బాలుడిని గంటలోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన 2-టౌన్ పోలీసులు




**మహబూబ్ నగర్ పెన్ పవర్:** మహబూబ్నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్, లో 9 వ తరగతి చదువుతున్న సాయి సుధీర్ (14), తండ్రి: అశోక్, నివాసం: అభంగపట్నం, కోయిల్కొండ మండలం, మహబూబ్నగర్, తేది 02-07-2026 ఉదయం స్కూల్ నుండి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. బాలుడి తల్లి మ్యాన్రే లావణ్య తన కుమారుడు కనిపించడం లేదని తేది 02-07-2026 రాత్రి 8:15 గంటలకు మహబూబ్నగర్ 2-టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు అందుకున్న వెంటనే 2-టౌన్ పోలీసులు అప్రమత్తమై, పోలీసులు సేకరించిన సీసీ కెమెరా ఫుటేజ్ ను క్షుణ్ణంగా పరిశీలించి బాలుడి కదలికలను గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలుడి ఆచూకీ తెలుసుకున్న పోలీసులు, 2-టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్ర సత్యం చౌరస్తా వద్ద బాలుడు కూర్చుని ఉండగా గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి బాలుడిని వారికి అప్పగించారు.

## పాఠశాల బస్సు డ్రైవర్ కోటి కు అభినందన వెల్లువ

**హైదరాబాద్ పెన్ పవర్:** పాఠశాల బస్సు డ్రైవర్ కోటి సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సమయంలో డ్రైవర్ కోటి అసాధారణ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, విద్యార్థులందరినీ వెంటనే సురక్షితంగా బస్సు నుంచి బయటకు తరలించారు. అనంతరం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు మరియు నీటిని ఉపయోగించి మంటలను అదుపులోకి తీసుకువచ్చి ప్రశంసనీయమైన సేవలు అందించారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, ఎం వి ఐ కరుణాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆయనతో పాటు రవాణా శాఖకు చెందిన ఇతర సిబ్బంది కూడా సంఘటన స్థలంలో పాల్గొని అవసరమైన చర్యలు చేపట్టారు.డ్రైవర్ కోటి చూపిన చాకచక్యం, ధైర్య సాహసాలతో విద్యార్థులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఆయనను అభినందించారు.

## న్యాయ వ్యవస్థ లో న్యాయవాది కీలక పాత్ర

### బార్ కౌన్సిల్ సభ్యులు రఘునాథ్.

**కరీంనగర్ పెన్ పవర్:** న్యాయవ్యవస్థలో న్యాయవాది కీలకమైన పాత్ర పోషిస్తారని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వి రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన డిజిటల్ లైబ్రరీ లో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ పై సెమినార్ నిర్వహించగా ముఖ్య అతిథి గా బార్ కౌన్సిల్ సభ్యులు వి రఘునాథ్ హాజరై మాట్లాడుతూ ప్రజలకు న్యాయం అందించడంలో, రాజ్యాంగ హక్కులను కాపాడడంలో న్యాయవాదులు ముందుంటారు. విధి నిర్వహణలో భాగంగా బెదిరింపులు, దాడులు, తప్పుడు కేసులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్, 2026ను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ చట్టం 2026 జూన్ 2 నుండి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం వల్ల న్యాయవాదులు నిర్భయంగా విధులు నిర్వహించ గలరని తెలిపారు. ఈ చట్టం పై న్యాయవాదులకు అవగాహన కల్పించారు . పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ రఘునాథ్ కు హై కోర్టు లో మంచి పేరుందని, గతం లో హైదరాబాద్ బార్ అసోసియేషన్ కు అధ్యక్షులుగా పనిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సీనియర్,జూనియర్ న్యాయవాదులు, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

## 31 లక్షలతో వర్షపు నీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**హైదరాబాద్ పెన్ పవర్:** నియోజకవర్గ ప్రజల రోడ్లు, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మోండా డివిజన్ లో31లక్షల 10 వేల రూపాయల అంచనా వ్యయంతో కొత్తగా వర్షపు నీటి పైప్‌లైన్ (రెయిన్ వాటర్ సీవరేజ్) నిర్మాణ పనులను శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు.అల్లాడి పెంటయ్య నగర్ లో 9 లక్షల 50 వేల వ్యయంతో 200 మీటర్ల మేర పైప్‌లైన్, డొక్కాలమ్మ టెంపుల్ ప్రాంతంలో. 9 లక్షల 10 వేల వ్యయంతో 200 మీటర్ల మేర పైప్‌లైన్, కుమ్మరిగూడలో12 లక్షల 50 వేల వ్యయంతో 250 మీటర్ల మేర మొత్తం 650 మీటర్ల పొడవున పైప్‌లైన్ పనులను ఈరోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ,గత కొంతకాలంగా వర్షాలు పడినప్పుడు ఈ ప్రాంతాలలో నీరు నిలిచిపోయి స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను గుర్తించి తక్షణమే నిధులు మంజూరు చేయించామని, నిర్దేశిత కాలపరిమితిలోగా, ఎలాంటి రాజీ లేకుండా అత్యంత నాణ్యతా ప్రమాణాలతో ఈ పనులను పూర్తి చేయాలని అని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని, దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తూ నవ కంటోన్మెంట్ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తాననిఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## రెజ్లర్‌లకు మాజీమంత్రి, తలసాని శ్రీనివాస్ యాదవ్ అండ

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన రెజ్ల ర్ లకు మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అండగా నిలిచారు. ఈ నెల 10 వ తేదీ నుండి మూడు రోజుల పాటు హర్యానా రాష్ట్రం లోని రోహ్ తక్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి వివిధ కెటగిరీలలో 10 మంది బాలికలు, 20 మంది బాలురు ఎంపికయ్యారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రెజ్లర్ లకు ట్రాక్ లు, షూస్, పోటీలకు వెళ్ళి వచ్చేందుకు రవాణా ఛార్జీలకు ఆర్ధిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటాలని, గోల్డ్ మెడల్స్ తో తిరిగి రావాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో నే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రీడల అభివృద్ధి కి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. వ్యాయామశాలల అభివృద్ధి కి అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను వ్యాయామశాల ల నిర్వాహకులు సన్మానించారు. తమను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు రెజ్లర్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, అధ్యక్షుడు సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అస్లాం, నసీర్ కూలకి, కాలియా, సలాం ఆమూది, కాలీద్ బామూస్, కోచ్ లు వైష్ణవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి .

### -కూన శ్రీశైలం గౌడ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న వజ్రాయుధమని, 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు.శుక్రవారం బెజ్జంకి మండలం గుగ్గిళ్ళ గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటరు నమోదు కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీయువకులు, ఇళ్లు మారిన వారు, ఇంకా ఓటరు జాబితాలో పేరు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకొని పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

**బీజేపీ కుట్రలను భగ్నం చేయాలి**

**కవ్వంపల్లి :** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఓట్ల తొలగింపుతో అధికారంలోకి ఉద్దేశంతో కేంద్రప్రభు త్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. తమకు వ్యతిరేకవర్గానికి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నదే కుట్రలో భాగమని ఆయన పేర్కొన్నారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో అధికారాన్ని పగ్గాలు చేపట్టాలనే ఉద్దేశంతోనే సర్ ప్రక్రియను చేపట్టిందని ఆయన ఆరోపించారు. అర్హులవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురికాకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎంపీడీవో కె.ప్రవీణ్, తహశీల్దార్ శ్రీకాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెట్టి రాజు, జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ గుగ్గిళ్ల గ్రామశాఖ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు బైర సంతోష్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్,చెన్నారెడ్డి, రావుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు .

## మూడు విండోలకు కొత్త పాలకవర్గాలు నియామకపు ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని మానకొండూర్, తాడికల్, మెట్ పల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు నూతనంగా చైర్మన్లు నియామకయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ ఉత్వర్వులు జారీ చేశారు. మానకొండూర్ "విండో" చైర్మన్ నాగిశెట్టి రాజయ్యమానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ గా కొండపలకల గ్రామానికి చెందిన నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి(సదాశివపల్లి), కత్తెర్ల రాజు (అన్నారం), మంగురపు నర్సవ్వ(అన్నారం), గోని తిరుపతిగౌడ్ (చెంజర్ల), గాలి మొగిలి(చెంజర్ల), కొట్టె అంజిరెడ్డి (ఈదుల గట్టెపల్లి), ఎం.రామకృష్ణ (గంగిపల్లి), దూలం దేవేంద్ర (కొండపలకల), కొలిపాక మొగిలి(కొండపలకల), బుర్ర శ్రీకాంత్ (మద్దికుంట), కుర్ర వెంకటస్వామి (మానకొండూర్), ఏగోళపు శ్రీనివాస్ గౌడ్(ముంజంపల్లి) నియామకయ్యారు. తాడికల్ "విండో" చైర్మన్ గా కీసర సంపత్‌శంకరపట్నం మండలం తాడికల్ సింగిల్ విండో చైర్మన్ తాడికల్ గ్రామానికి చెందిన కీసర సంపత్, డైరెక్టర్లుగా కల్లెపల్లి రాజయ్య(కేశవపట్నం), తుమ్మేటి కొండల్ రెడ్డి (అంబాలపూర్), గీట్ల గోపాల్ రెడ్డి( ఇప్పలపల్లి), సంబు తిరుపతి(కరీంపేట్), గాజుల లస్మవ్వ(కేశవపట్నం), సుద్దాల రాజేందర్ (ముత్తారం), జనగాం రాజయ్య(తాడికల్), తిరుపతి సమ్మయ్య(తాడికల్), ద

పింగళి జయలక్ష్మి(తాడికల్), తాళ్లపల్లి కొమురయ్య(వన్నారం), ఓదెల రాజయ్య (ఎరడపల్లి), కలకుంట్ల సత్యనారాయణ రావు (ఎరపడపల్లి) నియామకయ్యారు. మెట్ పల్లి "విండో" చైర్మన్ గా గాజుల మహేష్‌మెట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ గా మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేశ్, డైరెక్టర్లుగా పొన్నోజు సదానందం(మెట్ పల్లి), నాంపెల్లి శ్రీనివాస్ (ఆముదాలపల్లి), పెద్ది ముత్తారెడ్డి (ఆముదాలపల్లి), వంగల కృష్ణారెడ్డి (కన్నాపూర్), కాల్వ మహేందర్ రెడ్డి (కన్నాపూర్), ఉప్పుగళ్ల రాజిరెడ్డి (కొత్తగట్టు), అంబాల కోటి (కొత్తగట్టు), గాజుల నిర్మల( లింగాపూర్), బొల్లిపల్లి శ్రీనివాస్ (లింగాపూర్), అంగిడి సారయ్య( మెట్పల్లి), బొమ్మెన గట్టయ్య (మెట్పల్లి), దుబ్బాల సమ్మక్క ( మొలంగూర్) నియామకయ్యారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు లేఖ రాస్తున్న..

# రాత పూర్వకంగా జావాబివ్వాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** నేను నా మాటకు కట్టుబడి ఉన్నాను ఈ రోజు కి కూడా ..ఆపరేషన్ సక్సెస్ , పేషంట్ డెడ్ అన్నట్లు బీఆర్ఎస్ తీరు ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడారు. తాము చేసిన అప్పులు మూడు లక్షల పదిహేడు వేల పదిహేను కోట్లు అని ఒక సారి, మూడు లక్షల 85,340 కోట్లు మాత్రమే అని మరో సారి కేటీఆర్ చెప్పాడు. 4 లక్షల 26 వేల 99 కోట్ల అప్పు అని ఒక సారి,4 లక్షల 17 వేల 496 మాత్రమే అని మరోసారి హరీష్ రావు చెప్పాడు. హరీష్ రావు, కేటీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నారా. నా మాటకు కట్టుబడి ఉన్నా.. రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నా. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు లేఖ రాస్తున్న.. రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలి. వాట్సాప్ ,మెయిల్ , స్పీడ్ పోస్ట్ ద్వారా ఈ లేఖ ను సీల్డ్ కవర్ లో పంపుతా. నేను చెప్పినదానికి కట్టుబడి ఉన్నా.. మంత్రి పదవి, ఎమ్మెల్యే పదవి రాజీనామా చేస్తానని అన్నారు. మీరు చెప్పింది అబద్ధం అయితే వాళ్లు ఏం చేస్తారో చెప్పాలి.. రాత పూర్వకంగా చెప్పాలి. ఏదో మాట్లాడి అసలు దానికి జవాబు చెప్పకుండా తప్పుదారి పట్టిస్తున్నారు. అప్పులు మూడు రకాలుగా ఉంటాయి. బీఆర్ఎస్ హయాంలో అప్పులు, బకాయిలు కలిపి 8,21,651 కోట్ల అప్పులు చేశారు. కార్పొరేషన్లు తెచ్చిన అప్పులతో మాకు సంబంధం లేదు, మేం తేలేదని చెపుతున్నారు.మీరు అప్పులు తేకపోతే ప్రభుత్వ ఖజానా నుంచి ఎందుకు చెల్లించారు. కాళేశ్వరం, పాలమూరు కోసం అప్పులు తెస్తే వాటిని రైతులతో కట్టిస్తారా? మిషన్ భగీరథ పేరుతో తెచ్చిన అప్పులు ఎవరు కడతారు..?



మంచి నీళ్లు తాగుతున్న ప్రజలతో కట్టిస్తారా..? కేసీఆర్ అసెంబ్లీ కి రావడం లేదు.. కనీసం మీడియా ను పిలిచి కేసీఆర్ మాట్లాడాలి. 5 గంటలకు నేను ప్రెస్ క్లబ్ కు వస్తా.. అక్కడైనా చర్చకు సిద్ధం. రుజువు చేయపోతే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా.. పార్టీని కేసీఆర్ రద్దు చేస్తారా.. సమాధానం తీసుకుని రావాలి. నేను రాజీనామాకు సిద్ధయని అన్నారు. మిస్టర్ హరీష్ రావు, కేటీఆర్.. ఆనాడు పాలమూరు పౌరుషం , చీము ,నెత్తురు ఉండబట్టే మంత్రి పదవికి రాజీనామా చేశా. కుడి భుజం, ఎడమ భుజం అని చెప్పుకున్న మహబూబ్ నగర్ లో ఒక్క సీటు తేలేకపోయారు. నేను రాజీనామా చేశాకే జిల్లాలో 6 సీట్లు బీఆర్ఎస్ కు వచ్చాయి. నా రాజీనామా ప్రభావం రాష్ట్రమంతా ఉంది. నేను మాటకు కట్టుబడి ఉండే వ్యక్తిని. సిగ్గుతప్పిన మాటలు మాట్లాడుకుంటు నాకు పౌరుషం లేదని అంటున్నారు. హరీష్ రావు వస్తానని అన్నాడు కాబట్టే అమరవీరుల స్థూపం వద్దకు వస్తానని చెప్పాను.

తెలంగాణ భవన్ కు రాలేదన్న వంక చూపించి విమర్శిస్తున్నారు. నేను అబద్దాలు చెప్పను.. నా ఆత్మగౌరవాన్ని ప్రశ్నించలేరు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి నేను గతంలో రాజీనామా చేశాను. ఉద్యోగానికి వెళ్లకుండా ఊరు వెళ్లి వ్యవసాయం చేసుకున్నాను. మీ లాగా అడ్డగోలుగా సంపాదించలేదు. అడ్డగోలు మాటలు మాట్లాడి ఆరోపణలు చేస్తే కబర్దార్. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా, తన్నీరు పౌరుషమో చెప్పాలి. నేను తోకముడిచేవాన్నీ కాదు. నాకు పదవులు ముఖ్యం కాదు.. ఆత్మగౌరవం ముఖ్యం. నా సవాల్ కు కట్టుబడి ఉన్నా. మీ పౌరుషం, రోషం, పరమితి ఏమిటో దమ్ము ధైర్యం ఉంటే చెప్పాలి. కూట్లో రాయి తీయలేనోడు,ఏట్లో రాయి తీస్తా అన్నట్లుగా కేటీఆర్, హరీష్ రావు తీరు ఉంది.. ఎన్నికల ముందు అవుటర్ రింగ్ రో?డ్డు ను అమ్మి రైతు బంధు కింద 5,800 కోట్లు మాత్రమే చెల్లించారని అన్నారు.

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టు దిట్టంగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దపెల్లిజిల్లాలోని గోదావరిఖనిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన లో పేర్కొన్నారు.



## వీబీజీ రామ్ జీ తో కేంద్రానికి పేరుస్తుందని కాంగ్రెస్‌కు అక్కసు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి. వీబీజీ రామ్ జీ పథకం ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరగడంతోపాటు గ్రామాల్లో ఆస్తుల సృష్టి జరగబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరుస్తుందని అక్కసుతోనే సుప్రీంకోర్టును ఆశ్రయిం చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈ స్కీం అమలు రాష్ట్రానికి భారం అన్పిస్తే ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలే తప్ప కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు, టీచర్లకు బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ సౌకర్యం కల్పించడాన్ని కేంద్ర మంత్రి స్వాగతించారు. ఒకవైపు బ్రేక్ ఫాస్ట్ సౌకర్యం కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలో ఏకంగా 10 వేల స్కూళ్లను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠశాలలను మూసివేయడం దుర్మార్గమన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరగడమే కారణమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతోందని, చాపకింద నీరుగా బలపడుతుండటంతో ఓర్వలేకే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కుమ్మక్కై బిగ్ బాస్ షోను తలపించేలా డ్రామాలాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు అవినీతి పార్టీలేనని, అందుకే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలను ఎలిమినేషన్ చేసి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ కొలగాని



శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కేఏపీపీ చంద్ర టింకు తో కలిసి కరీంనగర్ లోని 37వ డివిజన్ లో రూ.77 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. షాషామహల్ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఏమన్నారంటే:కరీంనగర్ లోనా 37వ డివిజన్ లో రూ.77 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. 7వ డివిజన్ లో బీజేపీ గెలవదని చాలా మంది చెప్పారు. కానీ గెలిచి చూపించాం చంద్రను ఆశీర్వరించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం సమస్యల్లేని డివిజన్ గా తీర్చిదిద్దుతా. మరో వారం రోజుల్లో రూ.50 కోట్ల యూడీఎఫ్ నిధులతో కరీంనగర్ లో రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించబోతున్నాం.

# హోమ్ మంత్రిగారి మౌనమెందుకో...

**విజయవాడ, జూలై 3, పెన్ పవర్:**
ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్.ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట.

కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట.రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయి స్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో

సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే... దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యా నించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపి స్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు.కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది

# మావిగన్ అయితే... విశాఖ సంగతేంటీ

**విశాఖపట్టణం జూలై 3, పెన్ పవర్:**
విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు.

కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు

జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.

# వై నాట్ 174 టీడీపీ నినాదమా...



**శ్రీకాకుళం, జూలై 2, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్శీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్ ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్ధుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు.టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు. తాను మూడు సార్లు అనకాపల్లి ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశాను అని విజయ్ చెప్పారు. అయితే ఆ మూడు సార్లు నిరాశ ఎదురైంది అని అన్నారు. అయితే అదే సమయంలో చంద్రబాబు తనను పిలిచి నన్ను నమ్ము విజయ్ నీకు మంచి స్థానం ఇస్తాను అని చెప్పేవారు అని విజయ్ గుర్తు చేసుకున్నారు. ఇపుడు బాబు ఏకంగా తనకు రాజ్యసభ సీటు ఇచ్చి తన మాటను నిలబెట్టుకున్నారు అని బాబుకు సదా కృతజ్ఞతలు అని విజయ్ చెప్పారు. తమ కుటుంబానికి మొదటి నుంచి చంద్రబాబు ఆదరణ మద్దతు ఉందని విజయ్ చెప్పారు. తాను

తెలుగుదేశం పార్టీకి జెండా కూలీగా పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. పార్టీ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తాను అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ అన్యాయం జరిగినా తాను ముందు ఉంటాను అని విజయ్ హామీ ఇచ్చారు. తాను పార్టీ కోసం ఎంతైనా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీగా తన వంతుగా కష్టపడి పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. నర్శీపట్నంలో సృష్టి క్షేత్రం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తామని విజయ్ తెలిపారు. సృష్టి క్షేత్రంలో ప్రపంచంలోనే ఎత్తైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నెలకొల్పుతామని విజయ్ చెప్పారు. నర్శీపట్నంలో అభివృద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని విజయ్ స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్ సింహ గర్జన చేశారు. రానున్న రోజుల్లో అయ్యన్న ప్లేస్ లో పూర్తి స్థాయి రాజకీయానికి విజయ్ సిద్ధపడుతున్నారు అనడానికి తాజా సభ ఒక నిదర్శనంగా చెబుతున్నారు.

# కమలం వైపు నేతల చూపు

**నెల్లూరు జూలై 2, పెన్ పవర్:**
ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నాయకులు కొందరు బీజేపీ వైపు చూస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా , ఎంపీలుగా ఉన్న ఒకరిద్దరు నాయకుల పేర్లు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. 'ఏమో.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో.. తప్పేముంది. ఈ పార్టీ కాకపోతే.. మరొకటి. నాకు సత్తా ఉంది. ఆ పార్టీకి చేర్చుకునేందుకు అవకాశం ఉంది.' అని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించారు. ఇక, ఎంపీల విషయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కోస్తా జిల్లాల్లోని ఓ ఎంపీ గత ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో టీడీపీ బీ ఫాం దక్కించుకున్నారు. కానీ, ఆయన పార్టీపరంగా కంటే.. జాతీయస్థాయి నేతలతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. దీనికి కారణం.. అవసరమైతే.. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసమేనని ఆయన చెబుతున్నారు. ఇది వినేందుకు చిత్రంగా ఉన్నా.. ఎవరికి వారు అప్పుడే కర్చీఫ్‌లు రెడీ చేసుకుంటున్నారు.ఇక, వైసీపీలోనూ కొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటలో ఉన్నారన్న చర్చ కూడా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే.. ఆయన



కీలక పదవిని ఆశించారని.. ఆ పదవి ఇచ్చే విషయంలో బీజేపీ వెనక్కి తగ్గడంతో ఆయన మౌనంగా ఉన్నారని వైసీపీలోనే చర్చ సాగుతోంది. ఇక, ఓ ఎంపీ అయితే.. నేరుగా బీజేపీ నేతలతోనే కలివిడిగా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. బీజేపీ మంత్రుల కార్యాలయాల్లోనూ ఆయన కనిపిస్తున్నారు. ఎంపీగా పనులు చేయించుకునేందుకు వచ్చానని సదరు పార్లమెంటు సభ్యుడు సెలవిస్తున్నారు. అయితే.. ఇదంతా ఎందుకంటే.. అధికార పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ల బెంగ కనిపిస్తోంది. వారిపై చేయిస్తున్న సర్వేల్లో మార్కులు తగ్గడం... వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయోలేదో నన్న బెంగ వెంటాడుతుండడంతో సదరు నేతలు ముందుగానే వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక, వైసీపీ నాయకుల్లో వచ్చే ఎన్నికలపై పెద్దగా ఆశలు లేకుండా పోతున్నాయన్న వాదన ఉంది. ఏమో మళ్లీ విపక్షంలో కూర్చునే పరిస్థితి వస్తుందేమోనని వారు బెంగ పెట్టుకున్నారని అంటున్నారు. అందుకే కేసుల బెడద నుంచి తప్పించుకునేందుకు బీజేపీతో ముందుగానే టచ్‌లోకి వెళ్లిపోయారట.

# టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

**కాకినాడ, జూలై 3, పెన్ పవర్:**
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి.ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు.రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది. మధ్యతరగతి వర్గాలు సొంత ఇంటి కల కోసం ఓపెన్ ప్లాట్లను ఎంచుకుంటుంటే, హైవే ఫేసింగ్ ఉన్న బిట్లను కమర్షియల్ అవసరాల కోసం కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పోటీ నడుస్తోంది.స్థానిక పారిశ్రామిక వేత్తల అండదండలు, నిరంతర నగదు సరఫరా పుష్కలంగా ఉండటంతో ఇక్కడి స్థిరాస్తి వ్యాపారానికి ఎటువంటి ఢోకా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అటు ఐటీ, ఇటు పారిశ్రామికంగా కాకినాడ-రాజమండ్రి జంట నగరాల మధ్య రీజినల్ గ్రోత్ కారిడార్ వేగంగా విస్తరిస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ చదరపు గజం ధరలు మరింతగా పెరగడం ఖాయమని, ఫలితంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం కూడా భారీగా పెరుగుతోందన్న అంచనాలున్నాయి.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి...

**విజయవాడ, జూలై 2, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి.. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలసి వచ్చేలా లేదు. పింఛన్ల పంపిణీ నుంచి గ్రామీణ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి వంటివి వైసీపీకి వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయి. నాడు వైసీపీ పనులు చేసి ఉంటే ఇప్పుడు చెప్పుకొనేందుకు అవకాశం ఉండేదని కూటమి నాయకులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఈ ఎఫెక్ట్ ఎక్కువగా పడే ప్రభావం ఉందని అంటున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఐక్యత కూడా కనిపించడం లేదు. జగన్ రావాలి.. పార్టీని పట్టించుకోవాలని అనే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండే తప్ప.. వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్న లక్ష్యంతో నాయకులు ముందుకు కదలడం లేదు.మరోవైపు.. కూటమికి ఉన్న బలమైన వాయిస్ కూడా వైసీపీకి లేదనే చెప్పాలి. టీడీపీ, జనసేన అధినేతలు..తమ బలమైన గళంతో ప్రజల మధ్యకు వెళ్తుంటే.. వైసీపీ అధినేత మీడియా సమావేశాలకు.. చూసి చదువుతున్న స్క్రిప్టు లకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇవన్నీ.. వైసీపీని ఇరకాటంలో నెడుతున్నాయి. ట్రోల్స్‌కు గురయ్యేలా కూడా చేస్తున్నాయి. ఈ ప్రభావం కూడా స్థానిక ఎన్నికలపై పడే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేకతను నమ్ముకున్న వైసీపీకి దానిని చేరువ కావడం సాధ్యం కాదన్న అంచనాలు కూడా వస్తున్నాయి

# చడీ చప్పుడు లేకుండా.. పవన్ కళ్యాణ్ తిరుమల టూర్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఎక్కడికి వెళ్లినా అధికారికంగా ముందస్తు ప్రకటన విడుదల చేస్తారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా మీడియాకు ఇస్తారు. ప్రొటోకాల్‌లో భాగంగా డిప్యూటీ సీఎం హోదాలో ఆయనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందిస్తారు. గత నెలలో తెలంగాణలో పర్యటించినప్పుడు.. అదేవిధంగా ఢిల్లీలో పార్టీ సమావేశం ఏర్పాటు చేసుకున్నప్పుడుకూడా మీడియాకు, ప్రజలకు కూడా సమాచారం ఇచ్చారు. అయితే, తాజాగా పవన్ కల్యాణ్ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే తిరుమలలో ప్రత్యక్ష మ య్యారు. తిరుమల అధికారులకు కూడా ఆయన ఆలయానికి వచ్చే గంట ముందు మాత్రమే సమాచారం అందినట్టు చెబుతున్నారు. దీంతో హడావుడిగానే ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం అనూహ్యంగా తిరుమల శ్రీవారి ఆలయానికి చేరుకున్న పవన్ కల్యాణ్ ధ్వజస్తంభానికి మొక్కుకుని... నేరుగా శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఈ పర్యటనలో కేవలం ఆయన మాత్రమే ఉన్నారు. ఇదే రోజు ఏపీ మంత్రి, టీడీపీ యువ నేత నారా లోకేష్ కూడా శ్రీవారిని దర్శించుకోవడం గమనార్హం. అయి తే.. లోకేష్ పర్యటన వివరాలను.. ముందుగానే వెల్లడించినా.. పవన్ కల్యాణ్ టూర్ విషయాన్ని మాత్రం అధికారులు చెప్పకపోవడం గమనార్హం. ఇటీవల తన ఆరోగ్యం బాగోకపోవడంతో మొక్కులు చెల్లించుకు నేందుకు తిరుమలకు వెళ్లి ఉంటారని జనసేన నాయకులు చెబుతున్నారు. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు.

**దాదాపు ఏడాది తర్వాత..**

దాదాపు ఏదాది తర్వాత పవన్ కల్యాణ్ తిరుమలలో పర్యటించడం గమనార్హం. 2025 ప్రారంభంలో తిరుమల లడ్డూ వివాదం వచ్చినప్పుడు ఆయన సనాతన ధర్మ దీక్ష చేపట్టారు. ఆ సమయంలో దీక్షలోనే తిరుమలకు వెళ్లిన ఆయన.. అక్కడే విరమణ చేశారు. సనాతన ధర్మ దీక్ష పేరుతో తిరుపతిలో సభ కూడా నిర్వహించారు. ఆ తర్వాత.. మళ్లీ ఇప్పుడే తిరుమలలో పనవ్ కల్యాణ్ పర్యటించడం గమనార్హం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# సాయికృష్ణ మిస్టరీపై 'మెజిస్టీరియల్' విచారణ.. సర్కారు సంచలన నిర్ణయం!



విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదే సాయికృష్ణ(28) మిస్సింగ్ వ్యవహారం మిస్టరీగా మారిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం తీవ్రస్థాయిలో కుదిపివేస్తోంది. ఈ నెల 15న హైకోర్టు పూర్తిస్థాయిలో దీనిని విచా రించేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో సర్కారు తనవంతుగా.. ఈ ఘటనపై చర్యలను తీవ్రతరం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ఆరోపణలు ఎదుర్కొంటు న్న సీఐ నాగరాజును అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించింది.

అయినప్పటికీ.. సాయికృష్ణ కేసులో ఇంకా తీగ కదిలినా.. డొంక కదల్లేదు. ప్రభుత్వం కేసు నమోదు చేసి.. దాదాపు 15 రోజులు గడిచిపోతున్నా ఇంకా సాయికృష్ణ ఆచూకీ కానీ, ఆయన గురించి తదుపరి వివరాలు కానీ.. సేకరించలేక పోయారు. మరోవైపు ఒక సీఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను ప్రత్యకదర్యాప్తు బృందం అధికారులు అరెస్టు చేశారు. అయినప్పటికీ.. కేసు మూలాలను మాత్రం ఛేదించలేక పోయారు. ఈ పరిణామాలు ఇలా ఉంటే.. మరోవైపు హైకోర్టు, ఇంకోవైపు జాతీయ మానవ హక్కుల సంఘం కూడా సాయికృష్ణ కేసును తీవ్రంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత.. అంటే.. దాదాపు పుష్కరకాలంలో ఫస్ట్ టైమ్.. ఓ కేసు విషయంలో –మెజిస్టీరియల్– విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4(శనివారం) ఉదయం 11 గంటల నుంచి ఈ విచారణ జరుగుతుందన్నారు.

**ఏం చేస్తారు?**

మెజిస్టీరియల్ విచారణ అంటే.. పోలీసులతో సంబంధం లేకుండా.. జిల్లా మెజిస్ట్రేట్ హోదాలో కలెక్టర్ లేదా సబ్ కలెక్టర్(సబ్ మెజిస్ట్రేట్ హోదా) విచారణ చేస్తారు. ఈ సమయంలో ఎవరైనా.. ఎక్కడివారైనా సాయికృష్ణకు సంబంధించిన సమాచారాన్ని... ఈ కేసులో తమకు తెలిసిన అంశాలను నిర్భయంగా వెల్లడించేందుకు అవకాశం ఇస్తారు. ఈ వివరాలను సబ్ కలెక్టర్ అధికారికంగా పిన్ టు పిన్ నమోదు చేసి .. ప్రభుత్వానికి, అదేసమయంలో సంబంధిత కోర్టుకు కూడా పంపిస్తారు.

**ఏం జరుగుతుంది?**

ఏదైనా కేసులో తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు.. ప్రభుత్వాలు ఇలా మెజిస్టీరియల్ విచారణకు ఆదేశిస్తారు. తద్వారా.. బాధితులకు కొంత మేరకు ఉపశమనం లభిస్తుంది. అదేసమయంలో హైకోర్టులు సహా.. ఇతర ప్రజాసంఘాల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు కూడా సమాధానం లభిస్తుంది. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే ఇలాంటి విచారణలు జరుగుతాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇదే విజయవాడలో ఓ ఎస్సీ మహిళ కృష్ణ కుమారి లాకప్ డెత్‌కు గురైనప్పుడు మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు.

# అమెరికాలో భారతీయులపై మరోసారి విద్వేషం.. హిందూ ఆలయం ఎదుట రెచ్చిపోయిన మాగా కార్యకర్త



మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ తిరిగే కొందరు మేధావులకి ఈ మధ్య పాపం నిద్రపట్టడం లేదు. డొనాల్డ్ ట్రంప్ గారు వైట్ హౌస్‌లో అడుగుపెట్టారో లేదో.. వీరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది. ఈ క్రమంలోనే అమెరికాలో స్థిరపడిన భారతీయులను ముఖ్యంగా హెచ్1బీ వీసాల మీద వచ్చి రాత్రింబవళ్లు కష్టపడే టెక్కీలను చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. తాజాగా టెక్సాస్‌లోని ఫ్రిస్కోలో ఉన్న ఓ హిందూ ఆలయం సాక్షిగా ఇలాంటి విద్వేష 'కళాఖండం' ఒకటి బయటపడింది.

ఎలిజా షాఫర్ అనే ఒక సోషల్ మీడియా వీరుడు.. మగా కార్యకర్త అని చెప్పుకుంటాడు.. చేతిలో కెమెరా పట్టుకుని ఫ్రిస్కోలోని ఒక హిందూ దేవాలయం ముందుకు చేరుకున్నాడు. అక్కడ ప్రశాంతంగా ఆడుకుంటున్న చిన్న పిల్లలను చూసి ఆయనగారికి ఎక్కడో కాలిపోయింది. వెంటనే కెమెరా ఆన్ చేసి, ఆ చిన్నారులను రికార్డ్ చేస్తూ సంచలన 'ఆవిష్కరణలు' మొదలుపెట్టాడు. "నా వెనుక కనిపిస్తున్న ఈ పిల్లలంతా హెచ్1బీ వీసాదారుల పిల్లలే. వీరిని అమెరికన్లుగా పరిగణించడం ఏమాత్రం సరికాదు. వీరి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కూడా కారు" అంటూ సదరు మేధావి దేశభక్తిని ఒలకబోశాడు. అమెరికాలో పుడితే చాలు పౌరసత్వం వచ్చేస్తుందని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈయనగారికి అస్సలు నచ్చలేదట.

**జూలై 4 వేడుకలు చేసుకోనంత కసి..**

షాఫర్ గారి ఆవేదన అంతటితో ఆగితే అది విద్వేష ప్రచారం ఎందుకవుతుంది? టెక్సాస్ వీధుల్లో భారతీయ పిల్లలు ఎక్కువగా కనిపిస్తున్నారనే బాధతో.. తాను ఈసారి జూలై 4న వచ్చే 'అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని' కూడా జరుపుకోనని భీష్మించుకు కూర్చున్నాడు. అమెరికా పౌరసత్వం ఉన్న భారతీయ సంతతి పిల్లల వల్ల అమెరికా స్వాతంత్ర్య దినోత్సవానికే ముప్పు వచ్చేసిందన్నమాట.. ఇక పొలిటికల్ టచ్ ఇవ్వకుండా ఈయనగారి సోషల్ మీడియా వీడియో ఎలా పూర్తవుతుంది? అందుకే ఏకంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కూడా టార్గెట్ చేశాడు. జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ భారతీయ మూలాలు ఉన్న మహిళ కావడమే ఇక్కడ ఈయనగారి అసలు సమస్య. భారతీయ భార్య ఉన్న వ్యక్తులు అమెరికా ప్రభుత్వ పదవుల్లో ఉండడాన్ని తాను అస్సలు నమ్మనని, విశ్వసించనని షాఫర్ తేల్చి చెప్పేశాడు. అంటే భార్య భారతీయురాలు అయితే భర్త అమెరికాకు నమ్మకస్తుడు కాదనే వింత లాజిక్‌ను ఈయన కనిపెట్టాడన్నమాట.

**గతంలో జెండాలు.. ఇప్పుడు గుడులు..**

ఈ షాఫర్ గారికి భారతీయులంటే ఎంత 'అభిమానమో' చెప్పడానికి ఒక ఉదాహరణ ఉంది. గతంలో టెక్సాస్‌లో భారత జెండాను చించివేసిన ఒక వివాదాస్పద ఘటనను ఈయనే సోషల్ మీడియాలో తెగ షేర్ చేసి ఆనందించాడు. ఇప్పుడు ఏకంగా హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక చిన్నారులను వీడియోలు తీస్తూ విద్వేషాన్ని నూరిపోయడం చూస్తుంటే.. ఈయనగారి మాగా భక్తి కాస్తా 'భారతీయ విద్వేషం'గా మారిందని స్పష్టమవుతోంది.

ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు ఈయన లాజిక్కులపై నవ్వుకుంటూనే.. చిన్నారులను టార్గెట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని భారతీయ సంఘాలు సైతం ఈ విద్వేషపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయి. గ్రీన్ కార్డ్ క్యూలో దశాబ్దాలుగా వేచి చూస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్న భారతీయులపై ఇలాంటి 'సోషల్ మీడియా వీరుల' ప్రతాపం ఎన్నాళ్లో చూడాలి.

# సీఎం విజయ్-త్రిషపై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే అరెస్ట్





రాజకీయాల్లో మైకు దొరికితే చాలు.. ఏం మాట్లాడుతున్నామో కూడా మర్చిపోయి రెచ్చిపోవడం మన నేతలకు అలవాటే. కానీ ఆ నోటి దూల ఒక్కోసారి జైలు ఊచలు లెక్కపెట్టేలా చేస్తుందని తమిళనాడు డీఎంకే ఎమ్మెల్యే అనితా రాధాకృష్ణన్‌కు ఇప్పుడు బాగా అర్థమై ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్, అలాగే స్టార్ హీరోయిన్ త్రిషను ఉద్దేశించి ఆయన చేసిన "అతి" తెలివి కామెంట్లు.. చివరకు ఆయన్ను 'కటాకటాల' వెనక్కి నెట్టేశాయి. అసలు మ్యాటర్ ఏంటంటే.. ఇటీవల ఓ పబ్లిక్ మీటింగ్‌లో మైకు అందుకున్న రాధాకృష్ణన్ గారు, పొలిటికల్ విమర్శలు పక్కనబెట్టి పర్సనల్ లైఫ్ లోకి దూరేశారు. "రాజకీయాల్లోకి వచ్చి విజయ్ ఇరుక్కుపోయారు. ఇంట్లో నటి త్రిషతో ఎంతో సంతోషంగా ఉండేవారని, ఇప్పుడు ఆ రోజులను గుర్తు చేసుకుంటూ ఉంటారేమో" అంటూ లీకులు ఇచ్చారు. సరిగ్గా ఇక్కడే సీన్ రివర్స్ అయింది.. ప్రజా సమస్యలపై మాట్లాడమంటే.. ఎవరో ఇంట్లో ఏం జరుగుతుందో మనకెందుకు స్వామీ? అని సోషల్ మీడియా కోడై కూసింది. 'లియో' సినిమాలో విజయ్–త్రిష కెమిస్ట్రీ బాగా నచ్చేసిందో ఏమో గానీ, దాన్ని తెచ్చి పొలిటికల్ స్టేజీపై రుద్దేసరికి టీవీకే నేతలకు ఎక్కడో కాలింది. వెంటనే పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టేశారు.

**ముందస్తు బెయిల్ 'స్కెచ్' రివర్స్.. జైలులో రిమాండ్**

కేసు నమోదు కాగానే సీన్ అర్థమైన ఎమ్మెల్యే గారు, అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి మద్రాస్ హైకోర్టు మెట్లు ఎక్కారు. "అయ్యా.. నాది నోటి పొరపాటే.. ముందస్తు బెయిల్ ఇవ్వండి" అంటూ పిటిషన్ వేశారు. కానీ కోర్టు మాత్రం "మైకు దొరికితే ఏదైనా మాట్లాడతారా?" అన్నట్లుగా పిటిషన్‌ను నిర్మొహమాటంగా తిరస్కరించింది. ఇంకేముంది.. పోలీసులు ఎంట్రీ ఇచ్చి, ఆయన్ను అదుపులోకి తీసుకుని జడ్జి ముందు నిలబెట్టారు. కోర్టు కాస్తా సారు గారికి గట్టిగానే 'హోంవర్క్' ఇచ్చి, జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ జైలుకు పంపింది.

**సినిమా వేరు.. రాజకీయం వేరు బాసూ!**

రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు కామనే. పాలన బాగోలేదనో, విధానాలు నచ్చలేదనో తిట్టిపోస్తే అదో పద్ధతి. కానీ, ఇలా పర్సనల్ లైఫ్‌ను, అదీ ఒక మహిళా నటిని లాగి మాట్లాడటం ఏ రకమైన సంస్కారమో ఆ డీఎంకే ఎమ్మెల్యే గారికే తెలియాలి. ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళనాడు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. డీఎంకే, టీవీకే మధ్య సోషల్ మీడియాలో పెద్ద 'కత్తియుద్ధమే' నడుస్తోంది.

ప్రజల ముందు మాట్లాడేటప్పుడు నోటికి కొంచెం 'సెన్సార్' వేసుకోకపోతే.. ఇలాగే రిమాండ్ రూమ్‌లో కూర్చుని "ఆ రోజులను గుర్తు చేసుకోవాల్సి వస్తుంది" అని రాజకీయ విశ్లేషకులు చెవులు పిండి చెబుతున్నారు. మరి ఇప్పటికైనా మన నేతలు మారతారా? లేక నెక్స్ట్ వికెట్ ఎవరిదా అని వెయిట్ చేయాలా? చూడాలి.

# కార్పొరేట్ ఉద్యోగం వదిలేసి.. అవోకాడో సాగుతో లక్షల సంపాదన!



లండన్, హైదరాబాద్ వంటి నగరాల్లో స్థిరపడిన ఉన్నత విద్యావంతులు సైతం నేడు సంప్రదాయ కార్పొరేట్ ఉద్యోగాల కంటే కమర్షియల్ హార్టికల్చర్ (వాణిజ్య పండ్ల సాగు) వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సరికొత్త ట్రెండ్ భారతదేశంలో వ్యవసాయాన్ని ఒక లాభదాయకమైన వ్యాపారంగా నిలబడుతోందా? ఇది కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమయ్యే ఒక తాత్కాలిక ప్రయోగమా? మనకు అర్థమవ్వాలంటే ఒక ఉదాహరణ ఇది. ఏఐ రాకతో ఉద్యోగాలు ఊడుతున్న ఈరోజుల్లో చాలామంది టెక్ ఉద్యోగులు ఇలాంటి ప్రత్యామ్నాయాలపై ఆలోచిస్తున్నారు.. పూర్తి కథనంలోకి వెళితే...

లండన్‌లో ఉన్నత చదువులు చదివి, విదేశాల్లో స్థిరపడే సదవకాశం ఉన్నా.. వాటన్నింటినీ వదిలేసి మళ్లీ మట్టిని నమ్ముకున్నాడు తెలంగాణకు చెందిన రామ్ భూపాల్. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాక, లండన్ లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి మార్కెటింగ్‌లో ఎంబీఏ పట్టా అందుకున్నాడు. ఆ తర్వాత హీత్రూ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో.. అనంతరం హైదరాబాద్‌లోని ఒక లీడింగ్ రిటైల్ కంపెనీలో కార్పొరేట్ ఉద్యోగం చేశాడు. అయితే ప్రతిరోజూ తొమ్మిది నుంచి 5వరకూ సాగే ఉద్యోగం అతడికి విసుగును మిగిల్చింది.. ఆ క్రమంలోనే రంగారెడ్డిలోని సొంత ఊరికి చేరుకుని వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. సాధారణ రైతులలాగా కాకుండా.. మార్కెట్ గ్యాప్‌లను అధ్యయనం చేసి వినూత్నంగా ఏదైనా చేయాలనుకున్నాడు భూపాల్. సాంప్రదాయ పంటలు లేదా సాధారణ పండ్ల (మామిడి, జామ) సాగులో ఉన్న మిగులు సరఫరా నష్టాలు.. ధరల పతనాన్ని గమనించిన అతడు విదేశీ పండ్ల వైపు దృష్టి పెట్టాడు. ఈ క్రమంలో 2013లో ఇజ్రాయెల్ దేశం నుండి ఒక్కో మొక్కను రూ. 1,200 చొప్పున వెచ్చించి 200 హాస్ అవోకాడో మొక్కలను దిగుమతి చేసుకున్నాడు. అయితే స్థానిక వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక ఆ మొదటి ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. మొదటి ఓటమితో అధైర్యపడకుండా.. మన వాతావరణ పరిస్థితులకు, అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకునే సరికొత్త రకాలపై మళ్లీ పరిశోధనలు చేశాడు. దాదాపు 1.2 ఎకరాల భూమిలో 250 మొక్కలతో పూర్తి ఆర్గానిక్ (సేంద్రీయ) పద్ధతిలో అవోకాడో సాగును విజయవంతంగా ప్రారంభించాడు. 2023 నాటికి ఈ తోట నుండి మొదటి దిగుబడి ప్రారంభమైంది. ప్రారంభంలో తన స్నేహితుడి ద్వారా కువైట్ దేశానికి ఎగుమతి చేసిన జైపాల్... ఆ తర్వాత దేశీయ మార్కెట్లోనే నేరుగా కస్టమర్లకు విక్రయించడం ప్రారంభించాడు. ప్రస్తుతం ఒక్కో చెట్టు నుండి దాదాపు 20 కేజీల దిగుబడి వస్తోందని... కేజీ రూ. 250 చొప్పున అమ్ముతూ ఏడాదికి రూ. 8 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కేవలం పండ్లను అమ్మడమే కాకుండా.. తన ఎంబీఏ మార్కెటింగ్ తెలివితేటలను ఉపయోగించి భూపాల్ ఒక సమాంతర వ్యాపారాన్ని కూడా సృష్టించుకున్నాడు. తన పొలంలోనే అవోకాడో నర్సరీని ఏర్పాటు చేసి... వేడిని తట్టుకునే –పింకెర్టన్– వంటి ప్రీమియం రకాల మొక్కలను రూ. 300 నుండి రూ. 400 వరకు విక్రయిస్తున్నాడు. ఏడాదికి దాదాపు 5,000 నుండి 10,000 మొక్కలను అమ్మడం ద్వారా నర్సరీ నుండే అదనంగా మరో రూ. 5 లక్షల టర్నోవర్‌ను సాధిస్తున్నాడు. దళారులు, మండీలపై ఆధారపడకుండా వాట్సాప్– సోషల్ మీడియా ద్వారా నేరుగా కస్టమర్లకే విక్రయిస్తూ లాభాల మార్జిన్‌ను పెంచుకుంటున్నాడు.

భూపాల్ నాయక్ సాధించిన విజయం కేవలం ఒక వ్యక్తిగత సక్సెస్ స్టోరీ మాత్రమే కాదు.. నేటి యువతకు... ముఖ్యంగా చదువుకున్న నిరుద్యోగులు లేదా ఉద్యోగులకు ఒక పెద్ద రోల్ మోడల్. వ్యవసాయం అంటే కేవలం శ్రమతో కూడుకున్న నష్టాల వ్యాపారం కాదు... సరైన మార్కెట్ అవగాహన, ఆధునిక సేంద్రీయ పద్ధతులు పాటిస్తే ఐటీ ఉద్యోగాల కంటే మెరుగైన లైఫ్ స్టైల్ , ఆదాయాన్ని సొంత గడ్డపైనే సాధించవచ్చని ఆయన నిరూపించాడు. ఉన్నత చదువులు చదివిన వారు ఇలా –రివర్స్ మైగ్రేషన్– ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు ఎంతో శుభసూచకం. ముఖ్యంగా పంట పండించేందుకు భూమి ఉన్నా చాలామంది సాగు చేయడానికి సిద్ధంగా లేరు. ఇలాంటి నిరాసక్త వ్యక్తులు వ్యూహాత్మకంగా కొత్తగా ఎలా ఆలోచించాలో కూడా ఇతడు నేర్పిస్తున్నాడు. (నోట్: కృత్రిమ మేధస్సు ప్రకంపనాల కాలంలో ఉద్యోగాల గల్లంతయ్యే క్రమంలో ఇలాంటి ఐడియాలు పదిమందికి ఉపయోగపడాలని ఆశిస్తూ..)

# తప్పు ఒప్పుకోరు.. తగ్గేదే లే అంటారు: సియా గోయల్ 'సిగ్గులేని' సిగ్నల్స్



పుణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కాబోయే భర్తను కిరాతకంగా చంపేసిందనే ఆరోపణలతో జైల్లో ఊచలు లెక్కపెడుతున్న ప్రధాన నిందితురాలు సియా గోయల్.. తాజాగా మరోసారి హెడ్‌లైన్స్‌లోకి వచ్చింది. జైల్లో పెట్టినా, చేతులకు బేడీలు వేసినా అమ్మడి యాటిట్యూడ్‌లో మాత్రం నయాపైసా మార్పు రాలేదని నిరూపించుకుంది. విచారణ కోసం పోలీసులు ఆమెను ఇంటికి తీసుకెళ్తే.. అక్కడ మీడియా కెమెరాలను చూసి నీళ్లు నములుతుందో.. తలదించుకుంటుందో అనుకుంటే పొరపాటే.. సినిమా హీరోల రేంజ్‌లో బిల్డప్ ఇస్తూ ఏకంగా మీడియా వైపు చూస్తూ 'మిడిల్ ఫింగర్' చూపించి తన సంస్కారాన్ని నడిరోడ్డుపై ప్రదర్శించింది. "నేను తప్పు చేశానా? నాకా పశ్చాత్తాపం? తొక్కేం కాదు!" అన్నట్లుగా ఉన్న ఆమె బాడీ లాంగ్వేజ్ చూసి నెటిజన్లు, స్థానికులు నోరెళ్లబెడుతున్నారు.

**బాధితురాలి బదులు 'గ్యాంగ్‌స్టర్' బిల్డప్**

సాధారణంగా హత్య కేసుల్లో ఇరుక్కున్న వారు పోలీసుల జీపు ఎక్కుతుంటేనే మొహం చాటేసుకుంటారు. సమాజానికి ఏం సమాధానం చెప్పాలా అని సిగ్గుతో చచ్చిపోతుంటారు. కానీ మన సియా గోయల్ రూటే సెపరేటు.. కాబోయే భర్త ప్రాణాలు పోయాయన్న కనీస బాధ కానీ, జైలుకు వెళ్లానన్న పశ్చాత్తాపం కానీ ఆమె ముఖంలో లవలేశమైనా కనిపించకపోవడం గమనార్హం. ఇలాంటి వికృత చేష్టలు చూశాక నెటిజన్లు ఊరుకుంటారా? సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్‌తో మోతెక్కిస్తున్నారు. "చట్టం అంటే భయం లేదు, సమాజం అంటే గౌరవం లేదు.. ఏం యాటిట్యూడ్ తల్లీ!" అంటూ కొందరు సెటైర్లు వేస్తుంటే.. "ఈమెను జైల్లో కాదు, మెంటల్ హాస్పిటల్‌లో పెట్టాలి" అని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసిన తప్పుకు కోర్టు శిక్ష వేయకముందే.. తన ప్రవర్తనతో ప్రజల గుండెల్లో ఆల్రెడీ 'నేరస్థురాలిగా' ముద్ర వేయించుకుంది ఈ కిలాడీ లేడీ.

**చట్టం తన పని తాను చేసుకుపోతుందా? లేక ఈమె ఇలాగే చూపిస్తుందా?**

ఈ వైరల్ వీడియో సోషల్ మీడియాలో రచ్చ లేపుతుండటంతో న్యాయ నిపుణులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఎవరినీ నేరస్థులుగా ముద్ర వేయకూడదనేది చట్టం చెప్పే మాట. కానీ నిందితురాలే స్వయంగా ఇలాంటి 'అసభ్య' సంకేతాలతో సమాజాన్ని ఉడికిస్తుంటే చట్టంపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? ఏది ఏమైనా కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తు ఒకవైపు సాగుతుంటే.. సియా గోయల్ చూపించిన ఆ ఒక్క వేలు మాత్రం ఈ కేసును జాతీయ స్థాయిలో మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. పోలీసులు విచారణ పూర్తి చేసి కోర్టులో ఎలాంటి శిక్ష పడేలా చేస్తారో చూడాలి. కానీ ప్రస్తుతానికి మాత్రం ఈమె చేసిన పనికి నెటిజన్లు ఇచ్చే 'డిజిటల్ ప్యాసింజర్ థియేటర్' శిక్షను మాత్రం తప్పించుకోలేదు!

## సంపాదకీయం

# విచారణలేని విచారం!

భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ ఏడాది ఆరంభంలో 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరించింది. అదే కేసులో మరో ఐదుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ నిర్ణయం ఒక తీవ్రమైన, మౌలికమైన ప్రశ్నను మళ్లీ తెరపైకి తెచ్చింది. నేరస్థులుగా నిరూపించబడకుండా ఒక వ్యక్తిని జైల్లో ఉంచడానికి గరిష్ఠ పరిమితి ఎంత? విచారణ జరగకుండా జైల్లో ఉంచడం ఎంతకాలం వరకు న్యాయమవుతుంది? ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లు న్యాయస్థానం నిర్ణయం వెలువరించిన నాటికి ఐదేళ్ళకు పైగా విచారణ లేకుండా జైల్లో ఉన్నారు; ఇప్పుడు ఆ వ్యవధి ఆరేళ్ళకు చేరుకుంటోంది. ఒక వ్యక్తి నేరం చేశాడని నిరూపించకముందే ఆరేళ్లు జైల్లో ఉంచడం.. ఇది న్యాయమా? చట్టబద్ధ పాలనకు కట్టుబడ్డ రాజ్యాంగ వ్యవస్థలో ఇది సాధ్యమా? అన్న ప్రశ్నలు న్యాయ, రాజకీయ, మానవీయవర్గాల్లో చర్చలకు తావిస్తున్నాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద నమోదైన కేసుల్లో బెయిల్ పొందడం అత్యంత కష్టతరం. ఈ చట్టం కింద బెయిల్ మంజూరుకు కఠినమైన నిబంధనలుంటాయి. అయితే సర్వోన్నత న్యాయస్థానం తన పూర్వ తీర్పుల్లో స్పష్టం చేసింది -విచారణలో జాప్యం జరిగినప్పుడు రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద వ్యక్తి స్వేచ్ఛకు హక్కు సంక్రమిస్తుందని. అంటే చట్టబద్ధ పరిమితులు రాజ్యాంగ హక్కులను అధిగమించలేవు. కానీ తాజా బెంచ్ నిర్ణయంలో.. విచారణలో జాప్యం బెయిల్‌కు నిరపేక్ష హక్కు ఇవ్వదని, నేరం తీవ్రత, జాప్యానికి బాధ్యత ఎవరిదో వంటి అంశాలతో సమతూకం చేయాలని పేర్కొన్నారు. ఈ వాదన పైపైన సమంజసంగా అనిపించవచ్చు. కానీ దాని లోపల ఒక ప్రమాదకరమైన తర్కం దాగి ఉంది.

నేరం తీవ్రత అనేది బెయిల్ విషయంలో తొలి నిర్ణయ అంశం, నిజమే! అయితే విచారణ జాప్యంతో అత్యంత ముఖ్యమైన మానవ హక్కు ప్రశ్నగా మారినప్పుడు, మళ్లీ నేరం తీవ్రతను తెచ్చి అడ్డుపెట్టడం.. ఇదొక జారే వాలును సృష్టిస్తుంది. ఆ వాలు మీద నిలబడితే -తీవ్రమైన నేరాల్లో అభియోగం మోపబడిన వ్యక్తులను దశాబ్దాల పాటు విచారణ లేకుండా జైల్లో ఉంచవచ్చు. ఇది కేవలం సైద్ధాంతిక ప్రమాదం కాదు, ఇప్పటికే జరిగింది. యూఏపీఏ కింద అభియోగం మోపబడిన కొందరు వ్యక్తులు రెండు దశాబ్దాలకు పైగా జైల్లో ఉన్న తర్వాత చివరకు నిర్దోషులని తేలారు. వారి జీవితంలోని అత్యంత విలువైన సంవత్సరాలు జైలు గోడలమధ్యే గడిచిపోయాయి. ఈ దుఃఖకర సత్యం ఒకసారి కాదు, పలుమార్లు జరగడం.. న్యాయస్థానాలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించడం లేదా? విచారణ జాప్యానికి నిందితుడే బాధ్యుడని వాదించడం కూడా నిలబడదు. ఒక నిందితుడు ఎన్ని దరఖాస్తులు దాఖలు చేసినా, విచారణ వేగంపై అంతిమ బాధ్యత న్యాయమూర్తిదే. కోర్టు గది, కేసు పురోగతి, వాదనల వేగం.. ఇవన్నీ న్యాయమూర్తి నియంత్రణలో ఉంటాయి. కాబట్టి జాప్యాన్ని నిందితుడిపై మోపడం.. బాధ్యత నుంచి న్యాయ వ్యవస్థ తప్పించుకోవడమే అవుతుంది. అదే సమయంలో న్యాయవ్యవస్థలో అంతర్గత వైరుధ్యాలు కూడా ఈ కేసులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఢిల్లీ హైకోర్టు ఇటీవల కాశ్మీర్ మానవహక్కుల కార్యకర్త ఖుర్రం పర్వేజ్‌కు నాలుగేళ్ళకు పైగా విచారణ లేకుండా జైల్లో ఉన్నారని బెయిల్ మంజూరు చేసింది, సరైన నిర్ణయమే.

కానీ ఆ బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తే గతంలో ఢిల్లీ అల్లర్ల కేసుల్లో అదే నాలుగేళ్ళ వ్యవధి గడిచినా బెయిల్ నిరాకరించారు. అంతే కాదు.. అదే కేసుల్లో, అదే వాస్తవాల ఆధారంగా, అదే న్యాయమూర్తి ఒక ఏడాది వ్యవధిలో పరస్పర విరుద్ధమైన బెయిల్ తీర్పులు వెలువరించారు. ఇలాంటి అసమానత, అస్థిరత చట్టబద్ధపాలన పట్ల ప్రజలకుండే విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

ఈ పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది -యూఏపీఏ వంటి చట్టాలకు నిస్సందేహంగా రాజకీయ స్వభావం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఇలాంటి చట్టాలను రాజకీయ అసమ్మతికి వ్యతిరేకంగా వాడుకుంటున్నాయని నిరూపితమైంది. రాజకీయ విభేదం, చట్టపరమైన "తీవ్రవాదం" మధ్య రేఖ మసకబారేలా ఈ చట్టాలను వ్యాఖ్యానించడం ప్రభుత్వాలకు సులభంగా మారుతోంది. ఇటీవల యూకె, అమెరికాల్లో ఫలస్తీన్ విషయమై జరిగిన ఆందోళనల విషయంలో అసమ్మతిపై ఒత్తిడి చేయడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి నేపథ్యంలో న్యాయవ్యవస్థ పాత్ర మరింత కీలకమవుతుంది. ఈ చట్టాలు ఆయుధాలుగా మారకుండా నిరోధించే బాధ్యత న్యాయస్థానాలదే. సర్వోన్నత న్యాయస్థానంలో మరో రెండు న్యాయమూర్తుల బెంచ్ ఢిల్లీ అల్లర్ల బెయిల్ నిరాకరణను తప్పుగా విమర్శించింది, ఇది అరుదైన పరిణామం. రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధ పాలనలో విచారణ లేకుండా అనంతకాలం జైల్లో ఉంచడం మౌలికంగా తప్పని వారు స్పష్టం చేశారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి పెద్ద బెంచ్‌కు నిర్ణయాన్ని పంపారు. కానీ ఆ పెద్ద బెంచ్ ఎప్పుడు తీర్పు ఇస్తుందో తెలియదు. విచారణ లేని జైలు శిక్ష -ఇది కేవలం న్యాయపరమైన ప్రశ్న మాత్రమే కాదు. సామాజికంగా మనం ప్రజాస్వామ్య విలువలకు, మానవ హక్కులకు ఎంత నిజాయితీగా కట్టుబడి ఉన్నామన్న ప్రశ్న. "విచారణే శిక్ష" అన్న పాత నానుడి నిజమయ్యే పరిస్థితి రాకూడదంటే -న్యాయస్థానాలు ధైర్యంగా, సమానంగా వ్యవహరించాలి. విచారణ లేకుండా జైలు అంటే మానవ గౌరవాన్ని హరించడమే. ఆ చక్రాన్ని తెంచే సమయం ఆసన్నమైంది. 19వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో ఆల్ఫ్రెడ్ డ్రేఫస్ అనే సైనికుడిని నేరం నిరూపించకుండా ఐదేళ్లు జైల్లో ఉంచారు. ఆ కేసు తర్వాత అతను నిర్దోషిగా తేలింది. ఆ విషాదం ఫ్రాన్స్ న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు దారి తీసింది. భారత్‌లో కూడా ఇలాంటి సంస్కరణలు అవసరమని కేసులు స్పష్టం చేస్తున్నాయి. యూఏపీఏ వంటి చట్టాల అమలులో మరింత జవాబుదారీతనం, విచారణ వేగంపై కచ్చితమైన గడువులు, బెయిల్ నిర్ణయాల్లో స్థిరత్వం.. ఇవి తక్షణావసరం. ఒక వ్యక్తి నేరస్థుడా కాదా అని నిర్ణయించే ముందే దశాబ్దాల జైలు జీవితం అనుభవింపజేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, మానవ నైతికతకు వ్యతిరేకం. న్యాయం జాప్యం చేస్తే అది అన్యాయమే అవుతుందన్న సూత్రం కోర్టు గదుల్లో ఫ్రేమ్ చేసి వేలాడదీయడానికి మాత్రమే కాదు, ఆచరణలో నిలబెట్టడానికి కూడా. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌ల కేసు కేవలం వ్యక్తిగత కేసు మాత్రమే కాదు -ఇది భారత న్యాయ వ్యవస్థ తన అంతరాత్మను పరీక్షించుకునే అవకాశం. అది జరిగితేనే.. న్యాయం నిలబడినట్టు!!

## పనికొచ్చే మాట



# 90ఏళ్ల యువకుడి జిమ్ వర్కౌట్స్!

శరీరంలో మునుపటిలాంటి సత్తా లేదనో, లేక మోకాళ్ల నొప్పులనో వృద్ధాప్యం రాగానే చాలామంది శారీరక శ్రమకు దూరం జరుగుతారు. కానీ, వయసు పెరిగేకొద్దీ వ్యాయామం మరింత అవసరమని చెబుతున్నారు ముంబయికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆకాష్ సింగ్. ఆయన క్లినిక్‌కు వచ్చే 90ఏళ్ల వృద్ధుడు జిమ్‌లో కుర్రాళ్లకు పోటీగా కఠినమైన వ్యాయామాలు చేస్తున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ వయసులోనూ ఆయన చూపిస్తున్న పట్టుదల, క్రమశిక్షణ చూసి నెటిజన్లు సెల్యూట్ చేస్తున్నారు. మన ఇంట్లో ఉండే తల్లిదండ్రులను, నానమ్మ, తాతయ్యలను కూడా ఇలాంటి ఫిట్‌నెస్‌వైపు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ వీడియో గుర్తుచేస్తోంది.

జిమ్ అంటే కేవలం సిక్స్ ప్యాక్ కోసం కాదు!

"జిమ్ అనేది కేవలం సిక్స్ ప్యాక్ బాడీ బిల్డర్ల కోసం, యువత కోసం మాత్రమే అనుకోవడం పెద్ద అపోహ" అని డాక్టర్ ఆకాష్ పేర్కొన్నారు. 90 ఏళ్ల వృద్ధుడు జిమ్‌లో మొబిలిటీ డ్రిల్స్, అసిస్టెడ్ స్క్వాట్స్, రెసిస్టెన్స్ బ్యాండ్ రోయింగ్, డంబెల్స్‌వంటి ఎన్నో రకాల స్ట్రెంత్, కోర్ బిల్డింగ్ వ్యాయామాలను అలవోకగా చేస్తున్నారన్నారు. వృద్ధాప్యంలో జిమ్‌కు వెళ్లడమంటే అందంగా కనిపించడం కోసం కాదు, రోజువారీ పనులను ఎవరి సహాయం లేకుండా చేసుకోగలిగేలా కండరాల బలాన్ని పెంచుకోవడం కోసమని ఆయన వివరించారు.

**వృద్ధుల వ్యాయామంతో 5 ప్రయోజనాలు:**

వృద్ధాప్యంలో వ్యాయామం ఆపేయడంవల్లే శరీరం మరింత బలహీనపడుతుందని, నిరంతరం కదలికల్లో ఉండటంవల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఆత్మవిశ్వాసం, స్వతంత్రత: ఎవరిపైనా ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకునే శారీరక బలం లభిస్తుంది.

కదలికల్లో చురుకుదనం: శరీరంలో నొప్పులు, కీళ్ల బిగుతు తగ్గి, నడవడానికి, వంగడానికి అవసరమైన ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది.

బలమైన ఎముకలు, కండరాలు: వయసుతోపాటు వచ్చే కండరాల క్షీణతను అడ్డుకుని, ఎముకల సాంద్రతను మెరుగుపరుస్తుంది.

నొప్పులనుంచి ఉపశమనం: దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, కండరాల నొప్పుల తీవ్రత తగ్గుతుంది.

దీర్ఘాయువు: శారీరక శ్రమవల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, బీపీవంటి ముప్పులు తగ్గి, ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవితాన్ని గడపవచ్చు.

"మనం ముసలివాళ్లం అయ్యామని వ్యాయామం ఆపము.. వ్యాయామం ఆపేయడం వల్లే ముసలివాళ్లం అవుతాం" అని డాక్టర్ ఆకాష్ వ్యాఖ్యానించారు. 18 ఏళ్ల వారైనా, 89 ఏళ్ల వారైనా స్ట్రెంత్ ట్రైనింగ్ అనేది అందరికీ అవసరమని స్పష్టం చేశారు.

నెటిజన్లు ఏమంటున్నారంటే..

ఈ వీడియో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కొద్దిసేపట్లోనే విపరీతంగా వైరల్ అయింది. ఈ వృద్ధుడి ఎనర్జీ లెవెల్స్ చూసిన ఒక నెటిజన్.. "ఈ తాత తన వయసును ఓ పదేళ్లు వెనక్కి నెట్టేసారు," అని కామెంట్ చేయగా.. "నిజమైన ఇన్‌ఫ్లుయెన్సర్ అంటే ఈయనే, మన తల్లిదండ్రుల ఫోన్ ఫీడ్‌లో ఇలాంటి వీడియోలే రావాలి," అని మరొకరు రాసుకొచ్చారు. అమెరికాకు చెందిన ప్రముఖ 'జాన్స్ హాప్‌కిన్స్' నివేదిక ప్రకారం.. కూడా క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వృద్ధుల్లో నిద్రలేమి, ఒత్తిడి సమస్యలు తగ్గి, ప్రమాదవశాత్తు కిందపడిపోయే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని తేలింది.

# విశ్వ శక్తి..! విలక్షణ గాథ!!




జూలై 4, 1776న 13 రాష్ట్రాలతో జన్మించిన చిన్న దేశం, రెండున్నర శతాబ్దాల్లో ప్రపంచ చరిత్రనే తిరిగి రాసింది. కాలినడకల నుంచి క్వాంటం కంప్యూటర్ల దాకా, బానిసత్వం నుంచి పౌరహక్కుల దాకా, చంద్రుడిపై తొలి అడుగు నుంచి కృత్రిమ మేధ విప్లవం దాకా.. ప్రతి మలుపులో అమెరికా ముందే నిలిచింది. యుద్ధాలు చేసింది. తప్పులు చేసింది. కానీ ప్రతిసారీ లేచి నిలబడింది. 29 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో నేటికీ ప్రపంచ వ్యవహారాల కేంద్రంగా వెలుగొందుతున్న అమెరికా ఈ రోజు కొత్త వసంతాన్ని జరుపుకుంటోంది. ఇది.. దేశం కాదు.. నిరంతరంగా సాగుతున్న ప్రయోగం.

జూలై 4, 1776, చరిత్ర తన గమనాన్ని మార్చుకున్న రోజు. బ్రిటన్ వలస సంకెళ్ళను తెంచుకుంటూ 13 రాష్ట్రాలతో కూడిన చిన్న దేశం జన్మించింది. ఆ రోజు ఎవరూ ఊహించి ఉండరు.. రెండున్నర శతాబ్దాల తర్వాత ఆ చిన్న దేశం ప్రపంచ చరిత్రను తిరగ రాస్తుందని. ఈ రోజు జూలై 4, 2026. అమెరికా స్వాతంత్ర్యానికి సరిగ్గా 250 సంవత్సరాలు పూర్తవుతున్న రోజు. అర్ధ సహస్రాబ్ది పండుగలో అమెరికా సంబరాలు చేసుకుంటోంది. ఫిలడెల్ఫియా నుంచి వాషింగ్టన్ వరకూ వేడుకలు జరుగుతున్నాయి. కానీ ఈ వేడుక వెనుక ఉన్న అసలు కథ.. రెండున్నర శతాబ్దాల పరిణామం, పతనాలు, పునరుజ్జీవనాలు -అది మరింత లోతైనది, సంక్లిష్టమైనది, ఆలోచింపజేసేది. ప్రపంచం ఎన్నో సామ్రాజ్యాల వైభవాన్ని చూసింది. రోమన్ సామ్రాజ్యం, మొఘల్ సామ్రాజ్యం, బ్రిటిష్ సామ్రాజ్యం.. అన్నీ ఒకసారి శిఖరాగ్రాన ఉండి, తర్వాత చరిత్ర పుటల్లోకి వెళ్ళిపోయాయి. కానీ అమెరికా కేవలం ఒక సామ్రాజ్యంగా మిగిలిపోలేదు; ఒక ప్రయోగంగా, ఒక భావనగా, ఒక కలగా ప్రపంచ మనస్సులో స్థిరపడింది. ఆర్థికం, ఆవిష్కరణ, విజ్ఞానం, వినోదం, రణం, వితరణం, యంత్రం, తంత్రం.. అన్నింటిలో తనదైన ముద్ర వేసిన ఘనత అమెరికాకే సొంతం. వ్యవసాయాధార దేశంగా మొదలై, పారిశ్రామిక శక్తిగా ఎదిగి, సాంకేతిక విప్లవానికి ఆద్యుడిగా నిలిచి, అంతరిక్ష యుగానికి తెర తీసి -ఇప్పుడు కృత్రిమ మేధ యుగంలోనూ అగ్రభాగాన నిలిచింది అమెరికానే. 1880ల మధ్యలోనే బ్రిటన్‌ను అధిగమించి తయారీ వస్తువులు, ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచ అగ్రస్థానానికి చేరింది. 1969లో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెట్టినప్పుడు -అది కేవలం ఒక అమెరికన్ విజయం కాదు, మానవాళి సాధించిన శిఖరం. ఇవాళ అమెరికా జీడీపీ 29 ట్రిలియన్ డాలర్లకు పైగా.. ప్రపంచ మొత్తం ఆర్థిక ఉత్పత్తిలో దాదాపు నాలుగోవంతు ఒక్క దేశమే సాధిస్తోంది.

అయితే అమెరికా గాథ కేవలం విజయాల కథ మాత్రమే కాదు.. అంతరంగ సంఘర్షణల కథ కూడా. పైకి ఒకే దేశమైనా, రెండు అమెరికాలు దాగి ఉన్నాయి. ఒకటి -అవకాశాల గని, కలలను నెరవేర్చే వేదిక, ప్రపంచ మేధస్సును ఆహ్వానించే వ్యవస్థ. రెండోది -అసమానతలు, జాతివివక్ష, తుపాకీ హింస, ఆరోగ్య సేవలకు అందని కోట్లాది మంది జీవితాల కష్టాల కథ. బానిసత్వం అమెరికా జన్మలోనే పొందుపడిన పాపం. 1865లో బానిసత్వం రద్దయినా, జాతివివక్ష శతాబ్దాలపాటు కొనసాగింది. 1960ల పౌరహక్కుల ఉద్యమం, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ "ఐ హ్యావ్ ఎ డ్రీమ్" ప్రసంగం -వీటన్నింటికీ వెనుక ఉన్న బాధ, అది పుట్టించిన శక్తి అమెరికాను మరింత మానవీయంగా మార్చింది. 2008లో బరాక్ ఒబామా అధ్యక్షుడు కావడం ఒక చారిత్రక మలుపు. అది ఆ దేశం తనను తాను సరిచేసుకోగలదని చూపించింది. స్పెయిన్-అమెరికా యుద్ధం (1898) నుంచి మొదలుకుని, రెండు ప్రపంచ యుద్ధాలు, కొరియా, వియత్నాం, ఇరాక్, అఫ్ఘానిస్తాన్.. ఈ యుద్ధ గాథల మూలాల్లో అమెరికా శక్తి వ్యక్తమైంది, కానీ వైఫల్యాలూ దాగి ఉన్నాయి. 1945లో హిరోషిమా, నాగసాకిపై అణుబాంబుల విషాదం -ఆ నిర్ణయం నేటికీ నైతిక చర్చలకు కేంద్రంగా ఉంటుంది. శీతల యుద్ధం కాలంలో సోవియట్ యూనియన్‌తో అంతరిక్ష పోటీ, అణ్వాయుధ పోటీ -ఇవి ప్రపంచాన్ని అంచున నిలిపాయి. 1991లో సోవియట్ పతనంతో అమెరికా ఏకైక అగ్రశక్తిగా మిగిలింది. కానీ ఆ ఏకధ్రువ ప్రపంచం కూడా నిలబడలేదు. 2001 సెప్టెంబర్ 11 దాడులు అమెరికా అభేద్యమైన కోట అన్న భ్రమను పటాపంచలు చేశాయి. 2008 ఆర్థిక సంక్షోభం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీనతలను బహిర్గతం చేసింది. అయినా అమెరికా ప్రతిసారీ లేచి నిలబడింది. ఆ పునరుజ్జీవన శక్తే దాన్ని 250 సంవత్సరాల తర్వాత కూడా ప్రాసంగికంగా నిలిపింది.

250 సంవత్సరాల అమెరికా ప్రయాణంలో ఒక నిజం స్పష్టంగా కనిపిస్తుంది, ఇది ఒక జాతి నిర్మించిన దేశం కాదు. ప్రపంచంలోని జాతులన్నీ కలిసి నిర్మించుకున్న దేశం. ప్రపంచం నలుమూలల నుంచి వలస వచ్చిన ప్రజలు, భాషలు, మతాలు, సంస్కృతులు కలిసి రూపొందించిన సామాజిక ప్రయోగం. ఎక్కడెక్కడి నుంచో వచ్చినవారి కలలు అక్కడ పరిశ్రమలుగా మారాయి. పరిశ్రమలు సంపదను సృష్టించాయి. సంపద పరిశోధనకు బలమిచ్చింది. పరిశోధన ప్రపంచాన్ని మార్చే ఆవిష్కరణలకు దారి తీసింది. అందుకే అమెరికా అగ్రరాజ్యమైంది. ఇప్పుడు 2026లో అమెరికా కొత్త సవాళ్లు ఎదుర్కొంటోంది. ట్రంప్ 2.0 పాలనలో "అమెరికా ఫస్ట్" విధానం, మిత్రదేశాలపై సుంకాలు, నాటోనుంచి వైదొలగే ధోరణి.. ఇవి అమెరికా అంతర్జాతీయ నాయకత్వ పాత్రను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా ఆర్థికంగా, సాంకేతికంగా దగ్గరవుతోంది; అమెరికా ఆధిపత్యానికి నిజమైన సవాలు విసురుతోంది. కృత్రిమ మేధ రంగంలో పోటీ కొత్త శీతల యుద్ధంగా రూపుదాల్చుతోంది. అంతర్గతంగా అసమానతలు, రాజకీయ ధ్రువీభవనం, జనాభా మార్పులు.. ఇవి అమెరికన్ గుర్తింపు ఏమిటన్న ప్రశ్నను మళ్లీ ముందుకు తెస్తున్నాయి. అయితే చరిత్ర చెప్పే పాఠం ఏమిటంటే -అమెరికా ప్రతి సంక్షోభంలోనూ తనను తాను పునర్నిర్మించుకుంది. మహా మాంద్యం తర్వాత న్యూ డీల్ తెచ్చింది. రెండో ప్రపంచ యుద్ధంలో విజయం సాధించింది. శీతల యుద్ధంలో నిలబడింది. 9/11 తర్వాత తెప్పరిల్లింది. ఈ పునరుజ్జీవన సామర్థ్యమే అమెరికాను 250 సంవత్సరాల తర్వాత కూడా ప్రపంచ వ్యవహారాల కేంద్రంలో నిలిపింది. 250 సంవత్సరాల అమెరికా ప్రయాణం ప్రపంచానికి ఒక పాఠం నేర్పింది; వైవిధ్యం బలహీనత కాదు, బలం; ప్రశ్నించే స్వేచ్ఛ పురోగతికి పునాది; తప్పులను అంగీకరించి సరిదిద్దుకోగలిగే వ్యవస్థే నిజమైన ప్రజాస్వామ్యం. ఈ మూడు సూత్రాలే అమెరికాను అమెరికాగా చేశాయి. అవే దాన్ని మరో 250 సంవత్సరాలు ముందుకు నడిపించాయి.. నడిపిస్తూనే ఉంటాయి!! ■



మనం అనుకున్న విజయాలు సాధించకపోవడానికి మన అలవాట్లు, నిర్ణయాలే ప్రధాన కారణం! ప్రతి ఒక్కరూ గెలవాలనే కోరుకుంటారు. కానీ గెలుపు కోసం ఏం చేయాలో అది చేయరు. మనం ఏం మాట్లాడుతున్నాం అనే దానికంటే, రోజూ ఏం చేస్తున్నాం అనేదే ముఖ్యం. ఎందుకంటే మీ చేతలే మీ నిజమైన ఆలోచనలు. మిగతావన్నీ పైపై మాటలే! కాబట్టి ఈ రోజు నుంచే మీ దినచర్యను పరిశీలించండి. మీరు కోరుకునే జీవితానికి తగిన అలవాట్లు మీలో ఉన్నాయా అని నిజాయితీగా అడిగి చూసుకోండి. గుర్తుంచుకోండి.. గెలుపు ఒక్కరోజులో రాదు. కానీ ప్రతిరోజూ సరైన పని చేసినప్పుడు అది రాకుండా పోదు. తప్పక వచ్చి తీరుతుంది!

-మహాదేవ

## వింతల్లో వింతలు

# బొద్దింక డైవర్



సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నాలజికల్ వర్సిటీ శాస్త్రవేత్తలు అద్భుతమైన ఆవిష్కరణ చేశారు, బొద్దింకలకు మినియేచర్ డైవింగ్ సూట్ తయారు చేశారు! ఈ సూట్ వేసుకున్న బొద్దింక నీటిలో మూడు గంటలపాటు ఊపిరి పీల్చుకుంటూ తిరగగలదు. సాధారణంగా అందరూ చంపాలనుకునే ఈ పురుగును శాస్త్రవేత్తలు "సైబోర్గ్ కీటకం"గా మార్చారు. మడగాస్కర్ హిస్సింగ్ బొద్దింకలకు ఎలక్ట్రోడ్లు అమర్చి రిమోట్ కంట్రోల్‌తో నడిపించగలరు. 3డి ప్రింటెడ్ రెజిన్ సూట్‌లో హైడ్రోజన్ పెరాక్సైడ్, మాంగనీస్ డయాక్సైడ్ మిశ్రమం ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుంది. పరీక్షల్లో సెకనుకు 78.4 మిల్లీమీటర్ల వేగంతో నీటిలో కదలగలిగాయి. 2025లో మయన్మార్ భూకంప సహాయక కార్యక్రమంలో ఇవి వాస్తవంగా పాల్గొన్నాయి. భవిష్యత్తులో అంగారకుడిపై పరిశోధనలకు వాడాలని శాస్త్రవేత్తల కల!



# మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే గుండెపోటు వస్తుందా?

మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండె సమస్యలకు కొత్త ప్రధాన ప్రమాద కారకంగా మారుతున్నాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం వంటివి ఇప్పటికే గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కానీ, నిపుణులు ఇప్పుడు ఒత్తిడి, నిరాశ లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండెను ప్రభావితం చేస్తాయని అంటున్నారు. డిప్రెషన్, ఆందోళన 50 శాతం గుండె సమస్యలను పెంచుతాయని ఆరోగ్య నిపుణులు షాకింగ్ విషయాలు వెల్లడించారు.

**మానసిక ఒత్తిడి గుండెను ఎలా ప్రభావితం చేస్తుంది?**

మనం దీర్ఘకాలిక ఒత్తిడి లేదా ఆందోళనలో ఉన్నప్పుడు, శరీరం కార్టిసాల్, కాటెకోలమైన్‌లు వంటి ఎక్కువ హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మిటర్‌లను (ఉదాహరణకు, అడ్రినలిన్) ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతాయి.

**గుండెపై ఒత్తిడి ప్రమాదాలు**

మానసిక ఒత్తిడి గుండెను నేరుగా ప్రభావితం చేయడమే కాకుండా, దాని ఇతర దుష్ప్రభావాలు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ఒత్తిడికి గురైనప్పుడు, వారు తరచుగా ఒకే చోట పడుకున్నట్లు లేదా కూర్చున్నట్లు భావిస్తారు. ఒత్తిడికి గురైన వ్యక్తులు తక్కువ చురుగ్గా ఉంటారు. వ్యాయామంపై కూడా దృష్టి పెట్టరు. ఎక్కువసేపు ఒత్తిడి ఉండటం లేదా శారీరక శ్రమ లేకపోవడం వల్ల గుండె కండరాలపై ఒత్తిడి పెరిగి అవి బలహీనపడతాయి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

**అనారోగ్యకరమైన ఆహారం**

చాలా మంది ఒత్తిడిలో జంక్ ఫుడ్, వేయించిన ఆహారాలు, స్వీట్లు ఎక్కువగా తింటారు. ఈ ఆహారాలు బరువు పెరగడానికి దారితీయడమే కాకుండా రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తీవ్రతరం చేస్తాయి, ఇది రక్త నాళాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. గుండెను బలహీనపరుస్తుంది.

**నిద్రలేమి**

ఒత్తిడి, ఆందోళన నిద్రలేమికి దారితీయవచ్చు. దీని వలన రక్తపోటు పెరుగుతుంది. ఇది నేరుగా గుండెపై ప్రభావం చూపుతుంది. నిద్ర లేకపోవడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**మందులు తీసుకోకపోవడం**

రక్తపోటు లేదా మధుమేహం వంటి సమస్యలకు ఇప్పటికే మందులు తీసుకుంటున్న వారు, ఒత్తిడి కారణంగా మందులు వేసుకోకుండా ఇబ్బంది పడుతుంటారు. తరచుగా వారు మందులు సకాలంలో తీసుకోవడం మర్చిపోతారు. దీనివల్ల వ్యాధి అదుపు తప్పి తీవ్రమైన గుండె సమస్యలకు దారితీస్తుంది.



# వినికిడి లోపిస్తే



వినికిడి పరికరం వాడకాన్ని చిన్నతనంగా భావించి దాని జోలికి వెళ్లని వాళ్లుంటారు. వినికిడి లోపం ఉన్నా ఆ విషయాన్ని ఒప్పుకోడానికి తటపటాయించే వాళ్లుంటారు. 'వినికిడి పూర్తిగా పోయినప్పుడు ఆలోచిద్దాంలే!' అనుకుంటూ హియరింగ్ ఎయిడ్స్ వాడకానికి దూరంగా ఉండిపోయే వాళ్లుంటారు. కానీ వీటిని వాడకపోవడం వల్ల, దాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు

వైద్యులు వినికిడి లోపం జీవితంలో ఎప్పుడైనా తలెత్తవచ్చు. పుట్టుకతోనే ఈ లోపం ఉండొచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, పైబడే వయసు, పెద్ద శబ్దాలకు బహిర్గతమవడం వల్ల కూడా వినికిడి లోపం తలెత్తవచ్చు.

వృద్ధాప్యం: పైబడే వయసులో కంటిచూపు తగ్గినట్టే, 50 ఏళ్లు పైబడిన తర్వాత వినికిడి శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. అయితే, సాధారణంగా వినికిడి శక్తి తగ్గడం మొదలుపెట్టినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటూ హియరింగ్ ఎయిడ్ వాడకాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ హియరింగ్ ఎయిడ్ వాడకంతో కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తీసుకురాలేకపోయినప్పటికీ, వినికిడి పరికరాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. కాబట్టి సమస్యను గుర్తించిన వెంటనే హియరింగ్ ఎయిడ్‌ను వాడుకోవడం మొదలుపెట్టాలి. మరీ ముఖ్యంగా వినికిడి శక్తి లోపించడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిని, నలుగురిలో కలవలేక, మానసిక కుంగుబాటుకు లోనై, ఒంటరిగా గదికే పరిమితమైపోతూ ఉంటారు. దాంతో జీవన నాణ్యత కూడా దెబ్బ తింటుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.

పుట్టుకతోనే: పుట్టుకతోనే సంక్రమించే జన్యుపరమైన వ్యాధుల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మేనరికం వివాహాల్లో పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సహజం.

వ్యాధులు: మలేరియా, టైఫాయిడ్ లాంటి వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వినికిడికి సంబంధించిన నాడిని దెబ్బతీస్తాయి.

మందులు: జెంటామైసిన్, అమికాసిన్ లాంటి ఆటోటాక్సిక్ మందులు, కీమోథెరపీ మందులు, మలేరియా మందుల వాడకం వల్ల కూడా లోపలి చెవి దెబ్బతిని వినికిడి శక్తి తగ్గవచ్చు.

**పిల్లల్లో వినికిడి లోపం**

మేనరికం వివాహాల వల్ల లేదా ఇతరత్రా జన్యు సమస్యల వల్ల కొందరు పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో పసికందులు శబ్దాలకు స్పందించడం లేదని గ్రహించిన వెంటనే 'బేరా' (బ్రెయిన్ స్టెమ్ ఎవోక్‌డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ పరీక్ష చేయించాలి. ఈ పరీక్షతో పసికందుల వినికిడి లోపం ఏ మేరకు ఉందన్నది తెలుస్తుంది. అలాగే పది నెలలు దాటిన పిల్లలు చప్పుళ్లకు స్పందించకపోయినా, ఈ పిల్లలకు మాటలు రాకపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. ఏడాది లోపున్న పసిపిల్లల్లో వినికిడి శక్తి లోపిస్తే, కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చవలసి ఉంటుంది. దీంతో వినికిడి శక్తి పెరిగి పిల్లల ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. ఈ ఇంప్లాంట్‌ను అమర్చడం కోసం వైద్యులు పుర్రె లోపల వినికిడి నాడికి ఎలక్ట్రోడ్స్‌ను అనుసంధానించి, కోక్లియాను అమరుస్తారు. చెవి దగ్గర బహిర్గతమయ్యే విడి భాగంలో అవసరాన్ని బట్టి బ్యాటరీలను మార్చుకుంటూ పిల్లలు జీవితకాలం పాటు ఈ వినికిడి పరికరాన్ని వాడుకోవచ్చు.

**ఇది తాత్కాలికమే!**

వానాకాలంలో సాధారణ జలుబులతో తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. అలాగే అలర్జీల వల్ల, చలికి బహిర్గతమవడం వల్ల, జలాంతర క్రీడల వల్ల, విమానం నేల మీదకు దిగేటప్పుడు కర్ణభేరి మీద ఒత్తిడి పెరిగి, చెవి పోటు, తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. విమానం కిందకు దిగే సమయంలో చెవి పోటు, దిబ్బెడ వేధించే సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి ముందు ఆవిరి పట్టుకోవాలి. అలాగే విమానం దిగడానికి అరగంట ముందు యాంటీ హిస్టమిన్ మాత్ర వేసుకోవాలి. అలాగే అలర్జీలు, జలుబులకు చికిత్స తీసుకోవాలి. వీటితో తాత్కాలిక వినికిడి లోపం తగ్గిపోతుంది. పబ్‌లు, డిజెల్లోని బిగ్గర శబ్దాలకు బహిర్గతమైన తర్వాత చెవిలో గుయ్యిమనే శబ్దంతో పాటు వినికిడి తగ్గితే వెంటనే వైద్యులను కలిసి చెవి ఇంజక్షన్లు తీసుకోవాలి. లేదంటే కోల్పోయిన వినికిడి శక్తి తిరిగొచ్చే వీలుండదు. ఇలా జరగకుండా ఉండాలంటే, బిగ్గర శబ్దాలతో కూడిన ప్రదేశాలను సందర్శించేటప్పుడు, స్పీకర్లకు దూరంగా ఉంటూ, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అలాగే దీపావళి నాడు టపాసులు కాల్చే సమయంలో కూడా ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అయితే అప్పటికే చెవి సమస్యలతో బాధపడుతున్న వాళ్లు టపాసుల శబ్దాలకు ఏమాత్రం బహిర్గతం కాకుండా, గదులకే పరిమితం కావాలి.

**అకస్మాత్తుగా వినికిడి కోల్పోతే...**

కారణం ఏదైనా అకస్మాత్తుగా వినికిడి శక్తి కోల్పోతే, తిరిగి వచ్చేస్తుందిలే అని తాత్సారం చేయడం సరికాదు. ఇలాంటి సందర్భాల్లో ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే, వినికిడి శక్తి అంత త్వరగా తిరిగొస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రతించగలిగితే, చెవిలోకి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తెప్పించవచ్చు.

# హై బీపీ సమస్య ఇబ్బంది పెడుతోందా?.. జస్ట్ ఈ సింపుల్ చిట్కాలు..

ప్రస్తుతం హై బీపీ సమస్య అందరిని ఇబ్బంది పెడుతోంది. వైద్యులు వద్దకు వెళ్లితే.. భారీగా ఫీజు వసూల్ చేస్తున్నారు. దీనితోపాటు అత్యంత ఖరీదైన మందులు రాస్తున్నారు. దీంతో జేబుకు చిల్లు.. అది కూడా గట్టిగా పడుతుంది. అయితే ఇంట్లోనే మనం తినే.. తీసుకునే ఆహారంలో కొద్ది పాటు మార్పులు చేర్పులతో ఈ హై బీపీ సమస్యను దాదాపుగా నియంత్రించువచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అందుకు ఆరు చక్కటి పరిష్కారాలను వారు సోదాహరణగా వివరిస్తున్నారు.



మొదటిది.. కీర దోసకాయ.. బీపీని నియంత్రించడానికి ఇది చాలా బాగా పని చేస్తుంది. కేజీ కీర దోసకాయ ఖరీదు చాలా స్వల్పంగానే ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. వీటిని రోజు తీసుకోవడం ద్వారా సులభంగా హై బీపీని నియంత్రివచ్చు.

రెండోవది.. రాతి ఉసిరి (ఆమ్లా).. ఇందులో ఎన్నో పోషకాలతోపాటు విటమిన్లు సైతం ఉంటాయి. ఇది సహజ సిద్ధంగా లభిస్తుంది. అంతేకాకుండా దీని వల్ల అనేక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. ఇది శరీరాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. అంటే శరీరంలోని విషాన్ని పూర్తిగా తొలగించే శక్తి.. ఈ రాతి ఉసిరికి ఉంది. ఈ రాతి ఉసిరి.. షుగర్, హై బీపీలను తగ్గించడమే కాకుండా బరువు తగ్గడంలో సైతం కీలకంగా వ్యవహరిస్తోంది.


మూడోవది అన్ని కూరగాయలు.. మరి మఖ్యంగా బెల్ పెప్పర్స్ (సిమ్లా మిర్చి). ఇందులో రంగులు ఉంటాయి. అంటే పసుపు, ఎరుపు, పచ్చని క్యాప్సికమ్ మిర్చి లభిస్తుంది. ఏ రంగులో ఉన్న ఈ మిర్చి తీసుకున్నా.. బీపీ మాత్రం నియంత్రణలోకి వస్తుంది. అలాగే క్యారెట్ సైతం బీపీ తగ్గడానికి సహాయపడుతుంది.

నాలుగోది.. ముల్లంగి (ర్యాడిష్) ఇది కొద్దిగా ఘాటుగా ఉంటుంది. అందుకే దీనిని తినడానికి ఎవరూ అంతగా ఇష్టపడరు. కానీ దీనిని కూరగా చేసుకుని తీసుకుంటే మాత్రం చాలా మంచిది.

ఐదోవది.. మజ్జిగ (బటర్ మిల్క్): చాలా పల్చగా చేసుకుని మజ్జిగ తాగాలి. అందులో కొద్దిగా జీలకర్ర పొడితోపాటు సొంపు పొడి వేసుకుని తీసుకుంటే వెంటనే రిలీఫ్ ఉంటుంది. పేగులు సైతం ఆరోగ్యంగా ఉంటాయి.

ఆరోవది.. రాత్రి సమయంలో గ్లాస్ వాటర్ తీసుకోవాలి. టీ స్పూన్ సొంపు, జీలకర్ర, ఒక దాల్చిన చెక్కను నీటిలో వేసి నానబెట్టాలి. ఉదయం అందులో పొదీనా వేయాలి. ఈ మిశ్రమంలో ఆఫ్ టీ స్పూన్ ములగాకు పొడి కూడా వేసి బాగా మరిగించాలి. అనంతరం వడ పోసుకుని.. అందులో నిమ్మకాయ పిండుకుని తాగితే.. బీపీ వెంటనే కంట్రోల్ అవుతుంది. ఇది క్రమం తప్పకుండా ప్రతి రోజు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

# సోరియాసిస్‌కు సమర్థమైన వైద్యం



తిరగబెడుతూ వేధించే చర్మ వ్యాధుల్లో సోరియాసిస్ ఒకటి. అయితే శరీర తత్వం, ప్రేరేపించే అంశాలు, మందుల ప్రభావాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ మొండి సమస్యను కూడా పరిష్కరించుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం!

సోరియాసిసకు ఫలానా కారణమని కచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల, రక్షణ వ్యవస్థ శరీరం మీదే దాడి చేసే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా సోరియాసిస్ తలెత్తవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. అయితే ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడితో కూడిన జీవితం, కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల సోరియాసిస్ తలెత్తవచ్చని కొన్ని తాజా అధ్యయనాల్లో తేలింది. కొన్ని సందర్భాల్లో చర్మ గాయాలు మానిన తర్వాత, ఆ ప్రదేశంలో సోరియాసిస్ తలెత్తుతూ ఉంటుంది. దీన్ని 'కోబ్నర్ ఫెనొమినా' అంటారు. అలాగే కొన్ని రకాల మందులు, స్టిరాయిడ్స్ కూడా సోరియాసిసను ప్రేరేపిస్తాయి.

**ప్రధాన లక్షణాలు ఇవే!**

దురద చర్మంపై పగుళ్లు, పొట్టు ఏర్పడడం

పొట్టులా ఏర్పడిన ప్రదేశం చుట్టూరా మంట

గోకినప్పుడు పొట్టు రాలడం రకాలున్నాయి సోరియాసిసలో ఐదు రకాలున్నాయి.

**అవేంటంటే...**

ఫ్లేక్ సోరియాసిస్: 80% సోరియాసిసలు ఈ కోవకు చెందినవే! ఈ సమస్య పెద్దల్లో ఎక్కువ.

గుట్టేట్ సోరియాసిస్: పిల్లలు, యుక్తవయస్కుల్లో తలెత్తుతుంది.

ఇన్వర్స్ సోరియాసిస్: స్థూలకాయుల్లో, చర్మపు ముడతల్లో వస్తుంది.

పస్ట్యులార్ సోరియాసిస్: అరుదుగా పెద్దల్లో వస్తుంది.

ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్: 90% చర్మం సోరియాసిసకు గురైనప్పుడు ఎరిత్రోడెర్మిక్ సోరియాసిసగా పరిగణించాలి.

**శాశ్వత చికిత్స లేదు**

సోరియాసిస్ చికిత్సతో అదుపులోకొచ్చి, పూర్తిగా నయమైపోయిన భ్రమను కలిగిస్తుంది. కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కనుమరుగైపోయే ఈ సమస్య, అకస్మాత్తుగా తిరబెడుతూ ఉంటుంది. కాబట్టి సోరియాసిసకు శాశ్వత చికిత్స లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే ఈ వ్యాధిని అదుపులో పెట్టగలిగే సమర్థమైన చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు, శరీరంలో సోరియాసిస్ తలెత్తిన ప్రదేశం, మందులకు స్పందించే శరీర తత్వం, సమస్యను ప్రేరేపించే కారకాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ చర్మ సమస్యకు వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయవచ్చు. మరీ ముఖ్యంగా హెూమియోపతిలో సోరియాసిసకు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తారు. చర్మపు దురద ఏ ఏ సందర్భాల్లో తలెత్తుతోంది, ఎప్పుడు పెరుగుతోంది? అనే అంశాల ఆధారంగా అందించే చికిత్స ఒకటైతే, సోరియాసిస్ ప్యాచెసతో పాటు శరీర ఉష్ణోగ్రత, ఆహారపుటలవాట్లు, శరీరం మీద వాతావరణ ప్రభావాలు, మానసిక లక్షణాల ఆధారంగా అందించే చికిత్స రెండవది.

**నివారణ ఇలా...**

పొట్ట, ఛాతీ, తల, గోళ్లు, వేళ్ల మధ్య, పిరుదుల మధ్య, తొడల మధ్య మొట్టమొదటిగా సోరియాసిస్ తలెత్తుతుంది. వీటిలో ఏ ఒక్క శరీర భాగంలో సోరియాసిస్ తలెత్తినా, తలలో కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. అయితే ఈ వ్యాధిని నివారించుకునే సమర్థమైన మార్గాలు కొన్ని ఉన్నాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. అలర్జీ కారక ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, సమతులాహారం తీసుకోవడం, శుద్ధి చేసిన పదార్థాలు, పాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలకు దూరంగా ఉండడం అవసరం. అలాగే తేలికగా అరిగే ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ఈ నియమాలు పాటించగలిగితే ఉన్న సోరియాసిస్ అదుపులో ఉండడంతో పాటు కొత్తగా సోరియాసిస్ తలెత్తకుండా ఉంటుంది.

# టీమిండియాతో వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టులో కొత్త ముఖం

**భారత్‌తో వన్డే సిరీస్‌కు 16 మందితో ఇంగ్లండ్ జట్టు ప్రకటన**

**యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్, పేసర్ జోష్ టంగ్‌లకు తొలిసారిగా చోటు**

**గాయం నుంచి కోలుకుని జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన జోఫ్రా ఆర్చర్**

**కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్.. జట్టులో రూట్, బట్లర్ వంటి సీనియర్లు**

**గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్‌లకు విశ్రాంతి**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెలలో భారత్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్ తమ జట్టును ప్రకటించింది. 16 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో ఓ కొత్త ఆటగాడికి తొలిసారిగా అవకాశం కల్పించారు. ససెక్స్ యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్ ను ఈ సిరీస్ కు ఎంపిక చేశారు. టెస్టుల్లో రాణించిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్‌కు కూడా తొలిసారిగా వన్డే జట్టు నుంచి పిలుపు అందింది. మరోవైపు, స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి 50 ఓవర్ల జట్టులోకి రావడం ఇంగ్లండ్‌కు బలాన్నిచ్చింది.

2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లండ్ జట్టును ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన జేమ్స్ కోల్స్‌ను దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తుండటంతో జట్టులోకి తీసుకున్నారు. అతనితో పాటు లియామ్ డాసన్‌ను కూడా ఎంపిక చేయడం ద్వారా స్పిన్ బౌలింగ్ వనరులను పటిష్టం చేసుకోవాలని ఇంగ్లండ్ భావిస్తోంది. టెస్టుల్లో మంచి ప్రదర్శన కనబర్చినందుకు జోష్ టంగ్‌కు వన్డేల్లో అవకాశం దక్కింది. గాయాల నుంచి కోలుకున్న గస్ అట్కిన్‌సన్, సాకిబ్ మహమూద్ కూడా తిరిగి జట్టులో చేరారు. గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న ఈ జట్టులో జోస్ బట్లర్, జో రూట్, బెన్ డకెట్ వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు, ఈ సిరీస్ కోసం భారత్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఆటగాళ్లు ఆడనున్నారు. జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుండగా, 16న కార్డిఫ్, 19న లార్డ్స్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.

**ఇంగ్లండ్ వన్డే జట్టు:**
హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జో రూట్, విల్ జాక్స్, బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, శామ్ కరన్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేమ్స్ కోల్స్, లియామ్ డాసన్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# భారత్‌ను ఓడించడం మా వల్ల కాదు.. టీమిండియాపై పాక్ హెడ్ కోచ్ ప్రశంసలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైట్ బాల్ క్రికెట్‌లో భారత జట్టుకి తిరుగులేదని, ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత పవర్‌ఫుల్ జట్టు టీమిండియా అంటూ పాకిస్థాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ మైక్ హెస్సన్ ప్రశంసల జల్లు కురిపించాడు. పాకిస్థాన్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రతీ జట్టు ఇండియాని ఓడించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతుందని ఆయన కొనియాడాడు. ఇటీవల పాకిస్థాన్ జట్టు ప్రదర్శనలపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ మైక్ హెస్సన్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

**పాకిస్థాన్ కోచ్ మైక్ హెస్సన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్:**
పాక్ జట్టుపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ మైక్ హెస్సన్ మాట్లాడుతూ.. గతేడాది ఆసియా కప్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లు మినహా మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో మేం గెలిచాం.. వాస్తవం ఏంటంటే ప్రస్తుతం ప్రపంచంలోని ఏ జట్టైనా భారత్‌ను ఓడించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. కేవలం పాక్ మాత్రమే కాదు.. ప్రతి జట్టూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోందన్నాడు. తప్పో ఒప్పో పక్కన పెడితే భారత్‌తో ఆడేటప్పుడు పాకిస్థాన్ ప్రదర్శన ఎలా ఉందన్న దాని ఆధారంగానే మా జట్టును అంచనా వేస్తుంటారు. పాక్ పెద్ద టోర్నీల నాకౌట్ దశల్లో నిలకడగా చోటు దక్కించుకునే జట్టుగా ఎదగాలంటే, కేవలం భారత్ గురించే కాకుండా అన్ని జట్లపైనా క్రమం తప్పకుండా విజయాలు సాధించాల్సి ఉంది.

**భారత్ వర్సెస్ పాక్ హెడ్ టు హెడ్ రికార్డులు:**
ఆసియా కప్ 2025 టోర్నీలో భారత్‌తో ఫైనల్‌తో సహా మూడు మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్.. ఈ మూడింటిలోనూ ఘోర ఓటమిపాలైంది. అలాగే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో దాయాదీ దేశాలు ఒకసారి తలపడగా అక్కడ కూడా భారత్‌నే విజయం సాధించింది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఓడినప్పటికీ, ఆ తర్వాత జరిగిన వరుసగా మూడు మెగా టోర్నీల్లో (ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024, 2026) భారత్ విజేతగా నిలిచి వైట్ బాల్ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

**ఇంగ్లాండ్ సిరీస్‌పై భారత్ కన్ను:**
టీ20 ఫార్మాట్‌లో వరుసగా 16 ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచిన రికార్డు ఉన్న భారత్‌కు.. ఇటీవలే పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయి ఊహించని షాక్ తగిలింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న ఇండియన్ టీమ్ ఆ ఓటమి నుంచి తేరుకుని తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఐదు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో టీ20 మ్యాచ్ రేపు (శనివారం) జరగనుంది.

# సౌతాఫ్రికాని ఓడించిన ఇంగ్లాండ్.. ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో బ్లాక్‌బస్టర్ పోరు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల టీ20 వరల్డ్ కప్ రెండో సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టు అద్భుత విజయం సాధించింది. గురువారం (జులై 2న) కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో సౌతాఫ్రికాపై 40 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. గత 2023 టీ20 వరల్డ్ కప్, 2025 వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయాలకు ఇంగ్లాండ్ ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. జూలై 5న లార్డ్స్ మైదానంలో జరగబోయే ప్రతిష్టాత్మక ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో ఇంగ్లాండ్ తలపడనుంది.

**ఇంగ్లాండ్ రికార్డు భాగస్వామ్యం:**
టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌కు ఆరంభంలో గట్టి షాక్‌లు తగిలాయి. సౌతాఫ్రికా బౌలర్లు మరిజానే కాప్, షబ్నిమ్ ఇస్మాయిల్ ధాటికి పవర్‌ప్లే ముగిసేసరికి ఇంగ్లాండ్ 22 రన్స్ కే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో ఇస్మాయిల్.. అమీ జోన్స్‌ను అవుట్ చేయడంతో మహిళల టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే 50 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించింది. ఈ దశలో గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన కెప్టెన్ నాట్ సివర్-బ్రంట్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 75 పరుగులు) , మాజీ కెప్టెన్ హీథర్ నైట్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్‌తో 58 పరుగులు)తో కలిసి ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 133 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మహిళల టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ చరిత్రలోనే ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం.

**చేతులెత్తేసిన సౌతాఫ్రికా బ్యాటర్లు:**
170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు లారా వోల్వార్డ్ (17), తజ్మిన్ బ్రిట్స్ (51) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. మొదటి వికెట్‌కు 43 పరుగులు జోడించిన తర్వాత వోల్వార్డ్‌ను లిన్సే స్మిత్ అవుట్ చేసి బ్రేక్ త్రూ ఇచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సౌతాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టారు. చార్లీ డీన్ ప్రమాదకరమైన బ్రిట్స్, మరిజానే కాప్‌లను అవుట్ చేయగా, లారెన్ బెల్, ఫ్రేయా కెంప్, సోఫీ ఎక్లెస్టోన్ తలో వికెట్ తీసి సౌతాఫ్రికా బ్యాటింగ్ లైన్‌అప్‌ను దెబ్బతీశారు. సౌతాఫ్రికా జట్టులో బ్రిట్స్ (51) మినహా మరెవ్వరూ రాణించలేకపోయారు. దీంతో దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 130 పరుగులకే పరిమితమై, 40 రన్స్ తేడాతో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. టోర్నీలో ఇప్పటి వరకు ఓటమి ఎరుగని ఆస్ట్రేలియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్లు ఇప్పుడు ట్రోఫీ కోసం ఫైనల్లో పోటీపడనున్నాయి.



**కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్**

# ప్రతి రోజు ఒక కొత్త బ్రాండ్: కోట్లు కొల్లగొడుతున్న జాన్వీ!



బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2.67 కోట్లకు పైగా ఉన్న ఫాలోయింగ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఉన్న క్రేజ్‌ను ఈ యంగ్ బ్యూటీ క్యాష్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే ట్రేడ్ వర్గాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ భామతో ప్రమోషన్స్ చేయించేందుకు క్యూ కడుతుండటంతో జాన్వీ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల డిజిటల్ షోరూమ్‌లుగా మారిపోయాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ కపూర్ పోస్ట్ చేసే ఒక్కో ప్రమోషనల్ కంటెంట్ వెనుక భారీ వ్యాపార సామ్రాజ్యం దాగి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ భామ ఒకే ఒక్క యాడ్ పోస్ట్ లేదా రీల్ కోసం సుమారు 7 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తోంది. అలాగే ఎక్స్ ఖాతాలో చేసే పోస్టులకు లక్షల్లో డిమాండ్ చేస్తోంది. కేవలం విడివిడి పోస్టులే కాకుండా ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలకు గంపగుత్తగా (బల్క్ ప్యాకేజీ) బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. ఏడాదికి 1 కోటి నుండి 2.5 కోట్ల వరకు ఒప్పందాలు కుదుర్చుకుంటోందని టాక్ వినిపిస్తోంది.

నెలవారీ లెక్కలు చూస్తే.. జాన్వీ కపూర్ డిజిటల్ ఆదాయం ఊహకందని స్థాయిలో ఉంది. ఒక నెలలో కనీసం డజనుకు పైగా విభిన్న బ్రాండ్స్ (లైఫ్ స్టైల్, గ్యాడ్జెట్స్, బ్యూటీ ప్రొడక్ట్స్) ప్రకటనలను నిరంతరాయంగా పోస్ట్ చేస్తూనే ఉంటుంది. ఈ రకంగా చూసినా.. సోషల్ మీడియా వేదికల ద్వారానే ఈ బ్యూటీ నెలవారీ ఆదాయం 1.5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఇంతటి క్రేజ్, కమర్షియల్ వాల్యూ ఉన్న మరో స్టార్ బ్యూటీ బాలీవుడ్‌లో లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

కేవలం డిజిటల్ ప్రమోషన్స్ మాత్రమే కాకుండా... సినిమాల పరంగానూ జాన్వీ కపూర్ పారితోషికం ఆకాశాన్ని తాకుతోంది. హిందీ చిత్రసీమలో ఈ భామ నటిస్తున్న ఒక్కో సినిమాకు బడ్జెట్ – ప్రొడక్షన్ హౌస్‌ను బట్టి సుమారు 5 కోట్ల నుండి 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు గ్లామర్ పాత్రలకు సమన్యాయం చేస్తుండటంతో బాలీవుడ్ మేకర్స్ ఈ యంగ్ బ్యూటీ అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడటం లేదు.

మరోవైపు.. సౌత్ ఇండియాలో (టాలీవుడ్‌లో) జాన్వీ కపూర్ ఎంట్రీ ఒక సంచలనంగా మారింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రానికి గానూ దాదాపు 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు టాలీవుడ్ టాక్. ఇక గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ క్రేజీ ప్రాజెక్ట్ -పెద్ది- కోసం దాదాపు 4 కోట్ల పారితోషికాన్ని వసూలు చేసిందని ప్రచారం ఉన్నా.. దానిపై అధికారికంగా క్లారిటీ లేదు. ఇలా సినిమాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ జాన్వీ కపూర్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.



**శివంగి వర్మ సొగసైన లుక్స్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965